
జనరాజకీయం కోసం...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 4 సంచిక - 4 పక్షపత్రిక ఫిబ్రవరి 16-28, 2013




# ప్రపంచ దేశాలు... ఆర్థిక స్వేచ్ఛ



సర్దార్‌పటేల్‌నగర్‌లోని మహిళల శిక్షణలో జేపీ



మోతీనగర్ స్కూల్ బిల్డింగ్ ప్రారంభోత్సవంలో డా॥ జేపీ



కూకట్‌పల్లి అభివృద్ధి కార్యక్రమాల సభలో జేపీ



బాలనగర్ హైస్కూల్ విద్యార్థులతో జేపీ



కూకట్‌పల్లి అభివృద్ధి కార్యక్రమాల సభలో జేపీ








మహిళామండలి మరియు వయోవృద్ధుల భవన నిర్మాణ
శంఖుస్థాపన కార్యక్రమంలో డా॥ జేపీ, సర్వే

కమలా నెహ్రూ పాలిటెక్నిక్ మహిళా కళాశాలలో
ప్రసంగిస్తున్న డా॥ జయప్రకాష్ నారాయణ్

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక ఫిబ్రవరి16-28, 2013

సంపుటి - 4 సంచిక - 4

## లోపలి పేజీల్లో...

ఆర్థిక స్వేచ్ఛలో దిగజారిన భారత్ .................5
మన రాష్ట్రాలు : ఆర్థిక స్వేచ్ఛ ........................7
ఉపాధి హామీ పథకం ............................. 8
నీరుగారుతున్న నీటి సంఘాలు.................... 9
పరిశోధనల్లో వెనుకబడిన భారత్................. 12
అభియోగపత్రం తెలుగులోనే ఉండాలి........... 12
వేతనం రూ. 15 వేలు దాటితే వృత్తిపన్ను........ 13
లోక్‌సత్తా సాధించిన విజయాలు ................. 14
ప్రమాణాలు లేని ఇంజనీరింగ్ కాలేజీలు......... 18
పడకేసిన సామాజిక వైద్యం........................ 20
ఆందోళన కలిగించే బాలికల నిష్పత్తి............. 21
ఆపదలో మహిళలకు అండగా..................... 23
గర్భిణీ స్త్రీలకు, శిశువులకు ఉచిత వైద్య సేవలు..... 24
నిజమైన యోధుడు - యువతకు ఆదర్శప్రాయుడు.26
అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నా.................. 28
జిల్లాల సమాచారం.................................29

## సంపాదకవర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

డి.వి.వి.యస్. వర్మ
సంపాదకులు

సంపాదక వర్గం

జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి
ఫొటోలు : ఎస్. సంజీవ్ కుమార్

# రాహుల్ మంత్రాంగం ఫలిస్తుందా?

## సంపాదకీయం

**2012** సంవత్సరం కాంగ్రెస్ పార్టీకి ఎంత మాత్రమూ కలిసి రాలేదు. ఒక పక్క దేశ ఆర్థిక వ్యవస్థ మందగమనంలో పడడం, మరో పక్క ద్రవ్యోల్బణం అదుపుతప్పడం, చేపట్టిన సంస్కరణలు ప్రజల మీద విపరీతమైన భారాలను మోపేవిగా వుండడం, మరోపక్క ప్రజలలో పెల్లుబుకుతున్న అసంతృప్తి, అవినీతి కుంభకోణాలు చుట్టుముట్టడంతో ప్రభుత్వం దాదాపు అచేతనంలో పడింది. మరోపక్క ప్రధాన ప్రతిపక్షంగా వున్న బి.జె.పి పరిస్థితి కూడా పార్టీలో అంతర్గత కుమ్ములాటలు, నేతల అవినీతి భాగోతాలతో ప్రధాని పదవి చుట్టూ ఎత్తులు పైఎత్తులతో ఆ పార్టీకి వచ్చిన అవకాశాలను వినియోగించు కోలేని స్థితిలో వుంది. ఇది కాంగ్రెస్‌కు కొంత ఊరట కలిగిస్తున్నా, వివిధ రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు విజయాలు వారి గొంతెమ్మ కోర్కెలు, తాత్కాలిక ప్రయోజనాలకు ఒత్తిళ్లు కాంగ్రెస్ పార్టీని కలవర పెడుతున్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని రాష్ట్రాలలో ముంచుకొస్తున్న ఎన్నికలు, 2014 ఎన్నికలు దగ్గరపడడంతో కాంగ్రెస్ పార్టీ వాటిని ఎదుర్కొనడానికి తంటాలు పడుతున్నది.

దీనిలో భాగంగానే కాంగ్రెస్ పార్టీ జనవరిలో జైపూర్‌లో చింతన్ శిబిరాన్ని నిర్వహించుకుంది. ఒక పక్క దిగజారుతున్న కాంగ్రెస్ స్థితిని మెరుగుపర్చుకోవడం, మరోపక్క రాహుల్‌కు పగ్గాలు అప్పగించడానికి పూర్వరంగాన్ని కల్పించడం లక్ష్యంగా ఇది సాగింది. మొదటి దానిలో వారు ఎంత మేరకు కృతకృత్యులయ్యారన్నది ప్రశ్నగానే మిగిలిపోయినా రెండో దానికి ఏర్పాట్లు మాత్రం జరిగిపోయాయి. రాహుల్ గాంధీని ఉపాధ్యక్షుడుగా నియమించి కాంగ్రెస్ వ్యవహారాల పగ్గాలు అప్పగించారు. ఇటీవల జరిగిన వివిధ రాష్ట్రాల ఎన్నికలలో తనదైన రీతిలో క్రియాశీల పాత్ర పోషించిన రాహుల్‌కి ఆశించిన ఫలితాలు రాలేదు. అయినా ఆయన తప్ప కాంగ్రెస్ పార్టీకి మరో మార్గం లేకుండా చేసుకున్నారు.

ఇప్పుడు రాహుల్ గాంధీ ముందు రెండు కర్తవ్యాలున్నాయి. ఒకటి పార్టీలో తనదైన నాయకత్వ ముద్రను సంపాదించుకోవడం, రెండోది కాంగ్రెస్‌ను రాబోయే ఎన్నికల్లో గెలిపించుకోవడం.

ఉపాధ్యక్షుడు పదవి చేపట్టిన తర్వాత పార్టీని సంస్థాగతంగా క్రియాశీలం చెయ్యడానికి, అధికారికంగా తన చుట్టూ పార్టీ యంత్రాంగాన్ని నిర్మించుకోడానికి వీలుగా కాంగ్రెస్ ముఖ్యమంత్రులు, పి.సి.సి.ల అధ్యక్షుల సమావేశానికి శ్రీకారం చుట్టారు. దీనిలో ఒక పంచ సూత్ర ప్రణాళికను ప్రకటించారు. గత అసెంబ్లీ పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసి రెండుసార్లు ఓడిపోయిన వారికి టికెట్లు నిరాకరించడం, ఒకే కుటుంబం నుండి ఒకరికే టిక్కెట్టు ఇవ్వడం, రాష్ట్ర, జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవులలో రెండుసార్లు కంటే ఎక్కువ పదవీకాలం లేకుండా చెయ్యడం, ఒకరికి ఒక్క పదవి మాత్రమే వుండడం, కొత్త వారికి ప్రత్యేకించి యువతకీ, మహిళలకీ ప్రాధాన్యత ఇవ్వడం వంటి అంశాలను ఆయన ప్రతిపాదించారు. ఇవన్నీ పార్టీలో నాయకత్వానికి అవకాశాలను పెంచడానికి మాత్రమే దోహదం చేస్తాయి. కాని ప్రజల ఓట్లు రాలడానికి పెద్దగా ఉపయోగపడవు. ఈ బడ్జెట్ రూపకల్పన మీద, అవినీతి మీద, ఎన్నికల సంస్కరణల మీద, స్థానిక ప్రభుత్వాల బలోపేతం మీద, మంచి ప్రమాణాల విద్య, ఆరోగ్యం అందించడం మీద తీసుకునే చొరవల మీదే ఆ పార్టీ భవిష్యత్తు ఆధారపడి వుంటుంది తప్ప రాహుల్ నాయకత్వం ఒక్కటే శ్రీ రామరక్ష కాదు. ◆




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**

*8-2-674బి/2/9, ప్లాట్ నం : 93*
*హ్యాపీ వ్యాలి, రోడ్ నం. 13ఎ,*
*బంజారాహిల్స్, హైదరాబాద్ – 500 034*

**ఫోన్ నంబర్లు :**
***040- 23311817, 23311819, 23311820, 23312829***
***ఫ్యాక్స్ : 040-23310612***
accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311817**

విడి ప్రతి : రు. 10 ,
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# ఆర్థిక స్వేచ్ఛలో దిగజారిన భారత్

- డి.వి.వి.యస్. వర్మ




ప్రపంచ దేశాలలో ఆర్థిక స్వేచ్ఛ 2012 వార్షిక నివేదిక 2013 జనవరిలో విడుదలైంది. ప్రతి ఏటా హెరిటేజ్ ఫౌండేషన్ ఈ నివేదికను రూపొందిస్తున్నది. 177 దేశాల పట్టికలో మనది 119వ స్థానం - సాధించిన ర్యాంకు 111. మనదేశం ఈ ర్యాంకులలో అజర్‌బైజాన్, బంగ్లాదేశ్, ఇరాన్, మాలి, నైజీరియా, పాకిస్తాన్, సియర్రా లియోన్, సిరియా, టాంజానియాల గుంపులో వుంది. బంగ్లాదేశ్ 109, నేపాల్ 110 స్థానాల్లో వుంటే భారతదేశం, పాకిస్థాన్‌లు 111వ ర్యాంకును పంచుకున్నాయి. ఘనా, బోట్స్‌వానా, కాంబోడియా, కజాక్‌స్థాన్, ఎల్‌సాల్వడోర్‌లు మనకంటే 40 స్థానాలకు ముందున్నాయి. అయితే ఇథియోపియా, అంగోలా, మయన్మార్, బురుండి దేశాలు మనకంటే కొంత దిగువన వుండి మనకి ఊరట కలిగిస్తున్నాయి.




మొదటి ఐదు స్థానాలను హాంగ్‌కాంగ్, సింగపూర్, న్యూజిలాండ్ స్విట్జర్‌లాంట్, ఆస్ట్రేలియా, కెనడాలు పొందాయి. ఈ చివరి రెండు దేశాలు ఒకే స్థాయిలో 5వ రాంకు పొందాయి.

ఈ ఆర్థిక స్వేచ్ఛ ర్యాంకులకు దేశాల అభివృద్ధికి మధ్య ఒక సంబంధం వుంది. అదీ మనం గమనించాల్సిన విషయం. సామాజిక రాజకీయ, ఆర్థికపరమైన ఉన్నతికీ, మెరుగైన వ్యక్తిగత జీవనానికీ ఈ ఆర్థిక స్వేచ్ఛకీ మధ్య విడదీయరాని అనుబంధం వుంది. ఆర్థికస్వేచ్ఛ హెచ్చుగా వున్న దేశాలు అది లేని దేశాల కంటే మంచి జీవనంలో ఉచ్ఛస్థితి లో వుంటున్నాయి.

మొదటి ర్యాంకులు పొందిన నాలుగోవంతు దేశాల సరాసరి స్థూల జాతీయోత్పత్తి చివరి ర్యాంకులు సాధించిన నాలుగోవంతు దేశాల కంటే దాదాపు 7 రెట్లు అధికంగా వుంది.

అలాగే ఈ మొదటి స్థానాల దేశాలలో అత్యంత పేదల సంపాదన చివరి స్థానాలు పొందిన దేశాల కంటే 10 రెట్లు ఎక్కువగా వుంది. అలాగే మొదటి దేశాలలో సగటు జీవితకాలం 79.5 సంవత్సరాలుంటే చివరి స్థానాల దేశాలలో 61.6 శాతం మాత్రమే వుంది. అలాగే రాజకీయ స్వేచ్ఛ, పౌరహక్కుల స్థితిలో కూడా చాలా వ్యత్యాసం వుంది.

మొత్తంమీద రెండు దశాబ్దాలుగా సాగిన ఈ అధ్యయనాలు ఎక్కడ ఆర్థిక స్వేచ్ఛ ఎక్కువగా వుంటే అక్కడ ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడుల రేటు హెచ్చుగా, ఆర్థిక ప్రగతి రేటు హెచ్చుగా వుందని స్పష్టం చేస్తున్నాయి. పెరుగుతున్న ఆదాయాలు, తరుగుతున్న పేదరికం కనిపిస్తున్నది. అలాగే ఆర్థిక స్వేచ్ఛ వున్న దేశాలలో ఆర్థిక, రాజకీయ, న్యాయవ్యవస్థలు ఆ దేశాల తలసరి ఆదాయాలను పెంచడంలో, ఆర్థికాభివృద్ధిని సాధించడంలో ముందున్నాయి.

ఆర్థిక స్వేచ్ఛ నివేదిక రూపొందించడానికి 5 అంశాలను ప్రాతిపదికగా తీసుకుని వాటి ఆధారంగా అభివృద్ధి పట్టికను రూపొందించారు. 1) ప్రభుత్వ వ్యయాల సైజు 2) న్యాయ

వ్యవస్థ, ఆస్థిహక్కుకు గల భద్రత 3) నికర డబ్బు 4) అంతర్జాతీయ వాణిజ్యానికి గల స్వేచ్ఛ 5) చట్టాలు. ఈ ఐదు అంశాలలో 24 భాగాలుంటాయి. అందులో మరిన్ని ఉప భాగాలుంటాయి. మొత్తంమీద 42 అంశాలు ఈ పట్టికకు ప్రాతిపదికగా వుంటాయి. అలాగే ప్రతి అంశాన్ని 0-10 స్కేలు మీద వాటి స్థితిని గుర్తించి అంతిమ పట్టికను రూపొందిస్తారు.

అందుచేత సాధ్యమైనంత శాస్త్రీయ ప్రమాణాలతో ఈ నివేదికలు రూపొందిస్తున్నారని భావించాలి. అలాగే దీనికి అవసరమైన గణాంక వివరాలను ఆయా దేశాల నుండి కాకుండా అంతర్జాతీయ సంస్థల నుండి సేకరించారు. వీటి ఆధారంగా వచ్చిన పాయింట్లు ఆధారంగా ర్యాంకులు ఇచ్చారు. హంగ్‌కాంగ్ 89.3 పాయింట్లతో అగ్రస్థానంలో వుండగా 88.0 పాయింట్లతో సింగపూర్ ద్వితీయ స్థానంలోనూ తర్వాత అస్ట్రేలియా, న్యూజిలాండ్, స్విట్జర్లాండ్‌లు ఉన్నాయి.

భారతదేశంలో 55.2 పాయింట్లతో 119వ స్థానంలో వుండి 111వ ర్యాంకును మాత్రమే పొందింది. గత సంవత్సరంతో పోల్చినపుడు 0.6 పాయింట్లు పెరిగాయి. ఈ పెరుగుదల పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ మరియు మోనిటరీ స్వేచ్ఛల మెరుగుదల వల్ల సాధ్యమైంది. అయితే ఇక్కడ సాధించిన పాయింట్లను దేశంలో పెరిగిన అవినీతి కబళించింది. దీనికి తోడు వ్యవస్థాగతమైన లోటుపాట్లు దీర్ఘకాలిక ఆర్థికాభివృద్ధిని దెబ్బతీస్తున్నాయని ఆ నివేదిక పేర్కొంది. సమర్థవంతంగా పనిచేసే న్యాయ, చట్ట వ్యవస్థల లోటు, ఆర్థిక వ్యవస్థ అంతటా వ్యాపించిన అవినీతి వల్ల క్రియాశీలకంగా వ్యవహరించే ప్రయివేటురంగం మందగమనంలో పడింది. అనేక రంగాలలో ప్రభుత్వ ఆధిపత్యం, దుబారాతో కూడిన సబ్సిడీ వ్యవస్థలతో బడ్జెట్‌లోటు పెరుగుతుందని ఈ నివేదిక పేర్కొంది.

భారతదేశంలో ఆర్థిక సంస్కరణలు ఆటుపోట్లుతో సాగుతున్నాయి. కీలకమైన సేవారంగాల సరళీకరణ ఆగిపోయింది. అయితే కొన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయి. 2012లో ఎఫ్‌డిఐలను ప్రోత్సహించడం ప్రభుత్వ సబ్సిడీలను తగ్గించడం ప్రారంభమైంది. మొత్తంమీద ఆర్థిక స్వేచ్ఛకు సంబంధించిన ఐదు రంగాలలోని 10 విభాగాలలో 1) ఆస్థి హక్కులకు సంబంధించిన స్వేచ్ఛకు 50.00 పాయింట్లు రాగా 2) అవినీతి నుండి స్వేచ్ఛకు అత్యల్పంగా 31.0 పాయింట్లు 3) ప్రభుత్వ వ్యయంలో ప్రమాణాలకు 77.9 పాయింట్లు 4) ద్రవ్యస్వేచ్ఛకు 78.3 పాయింట్లు 5) వ్యాపారస్వేచ్ఛకు 37.3 పాయింట్లు 6) కార్మిక స్వేచ్ఛకు 73.6 పాయింట్లు 7) మోనిటరీ స్వేచ్ఛకు 65.3 పాయింట్లు 8) వాణిజ్య స్వేచ్ఛకు 63.6 9) పెట్టుబడుల స్వేచ్ఛకు 35.0 10) ఫైనాన్షియల్ స్వేచ్ఛకు 40.0 పాయింట్లు పొందినట్లు ప్రకటించింది.

మొత్తంమీద భారతదేశంలో చట్టబద్ధపాలన ఒకే తీరున లేదు. న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని వ్యవస్థీకృతం చెయ్యడంలో బలహీనతలున్నాయి. న్యాయప్రక్రియ దీర్ఘకాలం తీసుకునేదిగాను, వ్యయంతో కూడుకున్నదిగాను, రాజకీయ ఒత్తిళ్లకు గురయ్యేదిగానూ వుంది. ఆస్థిహక్కుకు సమర్థవంతమైన భద్రత కల్పించకపోవడం, మేధోహక్కుల పరిరక్షణలో చాలా లోట్లు వున్నాయి. అలాగే అవినీతి ఆరోపణల విచారణకు ఉద్దేశించిన స్వతంత్ర ప్రతిపత్తి గల అంబుడ్స్‌మన్ ఏర్పాటుకు పార్లమెంటు ఆమోదం లభించలేదని పేర్కొంది.

ప్రభుత్వ ఆదాయ వ్యయాల మీద అంచనా వేస్తూ మొత్తం స్థూల జాతీయోత్పత్తిలో 7.4 శాతం మాత్రమే ఆదాయ పన్నుగా వుంది. ప్రభుత్వ ఖర్చు మాత్రం 27.1 శాతం కావడంతో బడ్జెట్ లోటు తప్పడం లేదు. జి.డి.పి.లో 67.1 శాతం అప్పులభారం వుందని పేర్కొంది.

అలాగే దేశంలో కొత్తగా పెట్టుబడులు పెట్టడానికి, ఉత్పత్తి సాగించడానికి వ్యయప్రయాసలతో కూడిన పద్ధతులున్నాయి. ఒక వ్యాపారం ప్రారంభించామంటే సగటున కనీసం 25 రోజులు పడుతుంది. లైసెన్సు పొందడానికి చాలా ఖర్చు వుంటుంది.

అభివృద్ధి చెందని శ్రామిక మార్కెట్ వల్ల నిపుణత వుండడం లేదు. ఉపాధిరంగం ప్రధానంగా అసంఘటిత కార్మికులతోనే వుంది. అలాగే ప్రభుత్వం రకరకాల వస్తువుల మీద ధరల నియంత్రణ చేస్తున్నది. ఇవన్నీ ఆర్థిక స్థిరత్వాన్ని బలహీనం చేస్తున్నాయి.

ఇక వ్యాపారంలో సుంకాలు 8.2 శాతంగా భారంగా వున్నాయి. దీనికితోడు సుంకాలతో నిమిత్తం లేని అడ్డంకులు వున్నాయి. భారతదేశ బ్యూరోక్రసీ కొత్త పెట్టుబడులకు అననుకూల వాతావరణాన్ని కల్పించేదిగా వుంది. తక్కువ ధరలకు ప్రజలకు సరుకులు అందించే బహుళజాతి చిల్లర వర్తకాన్ని అనుమతించడంలో జాప్యం, ప్రభుత్వరంగ సంస్థల ఆధిక్యం వంటివి కొనసాగుతున్నాయని ఈ నివేదిక పేర్కొంది.

మొత్తంమీద ఆర్థిక స్వేచ్ఛకు, అవినీతి నిరోధకానికి తగిన చర్యలు అరకొర కావడం వల్లనే భారతదేశం అభివృద్ధి వేగం మందగించిందనేది దీని సారాంశం. ◆

# మన రాష్ట్రాలు : ఆర్థిక స్వేచ్ఛ

## మొదటి స్థానంలో గుజరాత్ .... చివరలో బీహార్

భారతదేశంలో ప్రధానమైన 20 రాష్ట్రాలలో ఆర్థిక స్వేచ్ఛ స్థితిపై రిపోర్టు విడుదలైంది. 2009-2011 గణాంకాల ఆధారంగా రూపొందించిన ఈ నివేదిక ఆయా రాష్ట్రాలకు ర్యాంకులను ప్రకటించింది. ఇందులో గుజరాత్ రాష్ట్రం మొదటిస్థానాన్ని పొందగా చివరగా బీహార్ వుంది. 2005లో 5వ స్థానంలో వున్న గుజరాత్ మొదటి స్థానాన్ని అందుకోగా బీహారు స్థానం అక్కడే వుండిపోయింది. అయితే బీహారు తన స్కోరు పాయింట్లను మాత్రం పెంచుకుంది.

జర్మనీకి చెందిన ఫ్రెడరిచ్ న్యూమాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థికవేత్తలు వివేక్ డెబ్రాయ్, లవీఫ్ భండారీలు ఈ రిపోర్టును రూపొందించారు. ప్రపంచదేశాల ఆర్థిక స్వేచ్ఛ కొలమానాలనే వీరు ఉపయోగించారు. స్వేచ్ఛ మార్కెట్‌ను సమర్థించే కాంటో ఇన్‌స్టిట్యూట్ ఈ నివేదిక రూపకల్పనలో భాగస్వామిగా వుంది.

2005, 2009 సంవత్సరాలలో ఆర్థిక స్వేచ్ఛలో మొదటి స్థానంలో వున్న తమిళనాడు రెండోస్థానం పొందింది. అలాగే 6వ స్థానంలో వున్న మధ్యప్రదేశ్ మూడవ స్థానానికి చేరింది.

అలాగే 2005లో 7వ స్థానంలో వున్న ఆంధ్రప్రదేశ్ 2009లో 3వ స్థానాన్ని పొందినా 2011 నాటికి 6వ స్థానానికి దిగజారింది. హర్యానా రాష్ట్రం స్థిరంగా 4వ స్థానాన్ని 2005 నుండీ నిలబెట్టుకుంది.

ప్రపంచంలో భారతదేశం స్థానం దిగజారుతున్న రాష్ట్రాలలో పనితీరు అంతకంటే మెరుగుగా కనిపిస్తున్నది.

ఒకనాడు ఆర్థిక వ్యవస్థకు పవర్‌హౌస్‌గా వున్న పంజాబు ఇప్పుడు 12వ స్థానానికి పడిపోయింది. దీనికి ద్రవ్యలోటు, విచ్చలవిడిగా, జనాకర్షణ పథకాలు కారణంగా కనిపిస్తున్నాయి.




మొత్తంమీద వివిధ రాష్ట్రాలలో అవినీతి పెరుగుదల, ప్రభుత్వాల వ్యయం, న్యాయం, చట్టపరమైన అంశాల అమలు, వ్యాపార వాణిజ్య స్వేచ్ఛలకు అంచనా కట్టడానికి ఈ నివేదికలు ఉపయోగపడేవిగా వున్నాయి. ◆

**Table 1.7: Overall Economic Freedom Ratings 2011**

| States | 2005 Overall | 2005 Rank | 2009 Overall | 2009 Rank | 2011 Overall | 2011 Rank |
|---|---|---|---|---|---|---|
| Gujarat | 0.46 | 5 | 0.57 | 2 | 0.64 | 1 |
| Tamil Nadu | 0.57 | 1 | 0.59 | 1 | 0.57 | 2 |
| Madhya Pradesh | 0.49 | 2 | 0.42 | 6 | 0.56 | 3 |
| Haryana | 0.47 | 4 | 0.47 | 4 | 0.55 | 4 |
| Himachal Pradesh | 0.48 | 3 | 0.43 | 5 | 0.52 | 5 |
| Andhra Pradesh | 0.4 | 7 | 0.51 | 3 | 0.51 | 6 |
| Jammu & Kashmir | 0.34 | 15 | 0.38 | 8 | 0.46 | 7 |
| Rajasthan | 0.37 | 12 | 0.4 | 7 | 0.43 | 8 |
| Karnataka | 0.36 | 13 | 0.34 | 13 | 0.42 | 9 |
| Kerala | 0.38 | 10 | 0.36 | 10 | 0.42 | 10 |
| Chhattisgarh | 0.33 | 16 | 0.33 | 15 | 0.41 | 11 |
| Punjab | 0.41 | 6 | 0.35 | 12 | 0.39 | 12 |
| Maharashtra | 0.4 | 9 | 0.36 | 10 | 0.39 | 13 |
| Uttarakhand | 0.33 | 17 | 0.26 | 19 | 0.38 | 14 |
| Assam | 0.3 | 19 | 0.29 | 18 | 0.36 | 15 |
| Uttar Pradesh | 0.35 | 14 | 0.34 | 13 | 0.35 | 16 |
| Orissa | 0.37 | 11 | 0.31 | 17 | 0.34 | 17 |
| West Bengal | 0.31 | 18 | 0.33 | 15 | 0.32 | 18 |
| Jharkhand | 0.4 | 8 | 0.38 | 8 | 0.31 | 19 |
| Bihar | 0.25 | 20 | 0.23 | 20 | 0.29 | 20 |

# ఉపాధి హామీ పథకం గ్రామీణులకు ఎదిగే శక్తినిస్తున్నదా ?

"పేదలకు 100 రోజుల గ్యారంటీ ఉపాధిని కల్పించే లక్ష్యంతో ప్రారంభమైన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఇజిఎస్) తాత్కాలిక ఉపశమనం మాత్రమే. కరవు వంటి భయంకర పరిస్థితులు నెలకొన్నప్పుడు మాత్రమే బ్రిటీషు పాలకులు ఇలాంటి పథకాలను అమలుచేసేవారు. ఉమ్మడి ఆస్తుల్ని పెంపొందించేలా, వ్యవసాయం లాభసాటికి దోహదం చేసేలా కొన్ని మార్పుల్ని చేసి ఉపాధిహామీ పథకాన్ని తాత్కాలికంగా కొనసాగిస్తూనే, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాలు, వ్యవసాయాధారిత పరిశ్రమల్ని నెలకొల్పటం, మద్యనియంత్రణ, స్థానిక సుపరిపాలన వంటి ఏర్పాట్లు చేస్తేనే క్రమంగా పేదరికం తొలగి ప్రజలు సాధికారతతో తలెత్తుకుని బతకగలరు" అని లోక్‌సత్తా తొలినుంచీ చెబుతోంది.

లోక్‌సత్తా వాదనే వాస్తవమని తాజాగా ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌కి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ షమిక ఆంధ్రప్రదేశ్‌లో జరిపిన ఒక సర్వేలో తేలింది. ఈ పథకం వల్ల తేలిగ్గా డబ్బు వస్తుండటంతో రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలలో స్వేచ్ఛా వ్యాపార సామర్థ్యం దెబ్బతింటోందని, ఫలితంగా ఊళ్లల్లో చిన్నచిన్న వ్యాపారాలు నాశనమవుతున్నాయని తేలింది. టైమ్స్ ఆఫ్ ఇండియా దినపత్రికలో ఇటీవల ప్రచురితమైన ఆ సర్వే సారాంశం, విశ్లేషణ ఇది...

గ్రామీణ ఉపాధి హామీ వల్ల 2004-05- 2009-10 మధ్య ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామాలలో ప్రజల వాస్తవ ఆదాయం 38శాతం మేర పెరిగిందని జాతీయ శాంపిల్ సర్వే సంస్థ (ఎన్ఎస్ఎస్ఓ) గణాంకాలు తెలియచేస్తున్నాయి. కానీ అదేసమయంలో చిన్న వ్యాపారాల నిర్వహణ ఖర్చులు భారీగా పెరిగి అవన్నీ మూతపడుతున్నాయి. తేలిగ్గా ఆదాయం లభించే రోజు కూలీలుగా పనిచేయటానికి మొగ్గుచూపే వారి సంఖ్య బాగా పెరుగుతోంది. "తాత్కాలికంగా ఈ ధోరణి మంచి ఫలితాలనిస్తున్నట్టే కనిపిస్తుంది. కానీ దీనివల్ల గ్రామీణాభివృద్ధికి దోహదం చేసే వాస్తవ ఆస్తులు ఏర్పడకపోవటంతో, కాలక్రమంలో దుష్పరిణామాలు, కొత్త సమస్యలు తలెత్తుతాయి" అని షమిక విశ్లేషించారు.

2007-2010 మధ్య కాలంలో 198 గ్రామాలలో, 1,066 పేద కుటుంబాల మధ్య ఈ సర్వేను నిర్వహించారు. ఈ గ్రామాలను రెండు విభాగాలుగా చేశారు. 103 గ్రామాలను 'ట్రీట్‌మెంట్ గ్రామాలు'గా తీసుకుని, అందులో 426 కుటుంబాలను గుర్తించి, వాటిలోని మహిళలకు సొంత వ్యాపారం ప్రారంభించేందుకు కావలసిన పెట్టుబడిని, వనరుల్ని, శిక్షణను అందించారు. వారిలో 60శాతం మంది పశుపోషణను ఎన్నుకోగా, ఇతరులు కిరాణా దుకాణాలు, టైలరింగ్, ఉద్యానవనాల పెంపకం వంటివి ఎంచుకున్నారు. తమ సూక్ష్మ వ్యాపారాలను వారు సమర్థవంతంగా నిర్వహించుకుని, దీర్ఘకాలంలో పేదరికం నుంచి బైటపడతారనే ఉద్దేశంతో ఈ ఏర్పాటు చేశారు. మిగిలిన 95 గ్రామాలలో ఎటువంటి జోక్యం లేకుండా 'కంట్రోల్ గ్రామాలు'గా ఉంచి, వాటిలో కేవలం పరిశీలనకే పరిమితమయ్యారు. కానీ మూడేళ్లు గడిచాక చూస్తే, 103 గ్రామాలలోని సూక్ష్మ వ్యాపారులలో దాదాపు సగం మంది మళ్లీ ఉపాధిహామీలో చేరేందుకు తమ వ్యాపారాలను వదిలిపెట్టేయటమో, లేక అమ్ముకోవటమో చేశారు. మిగిలినవారు కూడా ఊగిసలాటలో దాదాపు అదే బాటలో ఉన్నారు.

నిజానికి, సూక్ష్మ వ్యాపారాలు నడుపుతున్నవారి ఆదాయానికి, ఆస్తులకు., కంట్రోల్ గ్రామాలలో ఉన్నవారి ఆదాయాలకు, ఆస్తులకు మధ్య ఈ మూడేళ్లలో ఎటువంటి చెప్పుకోదగ్గ వ్యత్యాసం రాలేదు. అయినా, కేవలం తేలిగ్గా ఆదాయం వస్తుందనే ఉద్దేశంతో ప్రజలు ఉపాధి హామీ పథకం వైపు మళ్లుతున్నారని ఈ సర్వే విశ్లేషణలో తేలింది.

"భారత్ వంటి పేదదేశాలలో గ్రామీణ ఉపాధి హామీ వంటి పథకాల అవసరం. కానీ గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాల్ని విస్తరించి సుస్థిర గ్రామీణాభివృద్ధికి దోహదం చేసే స్వేచ్ఛా వ్యాపార సామర్థ్యాన్ని దెబ్బతీయకుండా ఆ పథకాల రూపకల్పన జరగాలి. ప్రజలు సాధికారతతో తమ సామర్థ్యాన్ని ప్రదర్శించటం ద్వారానే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. కానీ అలాంటి గ్రామీణ ఆర్థికాభివృద్ధికి ఊతమిచ్చే ఉమ్మడి ఆస్తుల్ని గానీ, నైపుణ్యాల్ని గానీ ప్రస్తుత ఉపాధి హామీ పథకం సృష్టించటం లేదు" అని షమిక అభిప్రాయపడ్డారు. ◆

# నీరుగారుతున్న నీటి సంఘాలు

చెరుకూరి వీరయ్య
(రచయిత నీటిపారుదల రంగ నిపుణులు)

బ్రిటీష్ హయాములో నీటిపారుదల వ్యవస్థలను వాణిజ్య సంస్థలుగా పరిగణించేవారు. పెట్టుబడికి తగిన ప్రతిఫలం వస్తుందనుకున్న పథకాలనే వారు చేపట్టారు. ఫలితంగా ఇంజినీరింగు సిబ్బంది, రైతుల మధ్య సుహృద్భావం, సదవగాహన లేకుండాపోయాయి. సాగునీటి పంపిణీలో నిర్దిష్ట ప్రణాళిక లేకపోవడంతో ఎగువ ప్రాంతాల రైతులు ఎక్కువ నీరు వినియోగించుకునేవారు. నీరు అందక దిగువప్రాంత రైతులు ఉసూరుమనేవారు. ఇక శివారు ప్రాంత రైతుల గోడు వినే నాథుడే ఉండేవాడు కాదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత యాభై ఏళ్లపాటు ఇదే పరిస్థితి కొనసాగింది. మనరాష్ట్రంలోనూ ఈ తంతు కొనసాగింది. నాగార్జునసాగర్, శ్రీశైలం, శ్రీరాంసాగర్ లాంటి భారీ ప్రాజెక్టులు సహా మరెన్నో మధ్య, చిన్నతరహా పథకాలు కార్యరూపం దాల్చాయి. సాగునీటి వినియోగ స్థోమత అనేక రెట్లు పెరిగింది. కాకపోతే, బ్రిటీష్ హయాములో మాదిరిగా వ్యవస్థ నిర్వహణ ఎలాంటి అభివృద్ధికీ నోచుకోక రైతుల కష్టాలు యథాతథంగా మరో యాభై ఏళ్లు కొనసాగాయి.

## పేరుకే చట్టం

సాగునీటి వ్యవస్థ సక్రమ నిర్వహణకు సాంకేతిక పరిజ్ఞానంతోపాటు సామాజిక విలువలూ అవసరమని గుర్తించిన రాష్ట్రప్రభుత్వం, వ్యవస్థ నిర్వహణలో రైతులకు విధాన నిర్ణాయక భాగస్వామ్యాన్ని కల్పించింది. ఇందుకోసం 1997లో 'ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల వ్యవస్థలు, రైతుల యాజమాన్య చట్టం' పేరిట ఒక శాసనాన్ని తీసుకువచ్చింది. ప్రాథమిక స్థాయిలో నీటివినియోగదారుల సంఘాలను, ద్వితీయ స్థాయిలో పంపిణీ సంఘాలను, పైయెత్తున ప్రాజెక్టు సంఘాలను ఏర్పాటు చేయాలని ఆ చట్టం నిర్దేశించింది. ఫలితంగా అన్ని నీటిపారుదల పథకాల పరిధిలో 10,749 నీటి వినియోగదారుల సంఘాలు, 342 పంపిణీ సంఘాలు, 86 ప్రాజెక్టు సంఘాలు ఏర్పాటయ్యాయి. సంఘాల పదవీకాలం తొలుత మూడేళ్లుగా నిర్ణయించినా, గడువును ఆరేళ్లకు పొడిగించారు. ఈ సంఘాలకు 1997, 2008 సంవత్సరాల్లో మాత్రమే ఎన్నికలు నిర్వహించారు.



### నిబంధనలు గాలికి...

చట్టంలో సాగునీటి సంఘాలకు కొన్ని ముఖ్యవిధులు, బాధ్యతలను నిర్దేశించారు. ఇంజినీర్లు రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక ప్రకారం ఆయకట్టు మొత్తానికి నీటిపంపిణీ సమానంగా జరగాలి. అయిదు లక్షల రూపాయలలోపు విలువైన కాలువ, మురుగు కాలువల మరమ్మతు పనులు చేపట్టాలి. పనుల నిర్వహణకు అవసరమైన నిధులు సమకూర్చుకోవాలి. నీటితీరువా వసూళ్లలో రెవిన్యూ శాఖకు తోడ్పడాలి. వివిధ నీటిసంఘాలు, రైతుల మధ్య వివాదాలను పరిష్కరించాలి. సంఘాల ఆదాయ, వ్యయాలపై వార్షిక తనిఖీలూ నిర్వహించాలి. సాగుభూమి విస్తరణ, పంట ఉత్పాదకత ఉత్పత్తుల పెరుగుదల, పనుల నాణ్యత వంటి అంశాలపై ఏటా సామాజిక తనిఖీ చేపట్టాలి. బాధ్యతల వికేంద్రీకరణకు ఉపసంఘాలను ఏర్పాటు చేయాలి. ఇలాంటి కీలక విధుల నిర్వహణ కాగితాలకే పరిమితమై క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు నిరాశాజనకమయ్యాయి.

### లోపాలు... దిద్దుబాట్లు

**శాశ్వత భవన సౌకర్యం :** రెవిన్యూ వ్యవస్థలో చివరిస్థాయిలో ఉన్న మండల కార్యాలయానికి సైతం ప్రభుత్వం శాశ్వత భవనాలు, కంప్యూటర్లు, రికార్డుల వ్యవస్థలు తదితర సౌకర్యాలను కల్పిస్తోంది. అదేవిధంగా శాశ్వత ప్రాతిపదికపై చట్టబద్ధంగా ఏర్పాటైన సాగునీటి సంఘాలకు అలాంటి సౌకర్యాలు ఎందుకు కొరవడుతున్నాయి? కనీసం ఫోన్లు, కంప్యూటర్లు, ఆయకట్టు పటాలు సమకూర్చకుండా ఏ సాగునీటిసంఘమైనా విధులను ఎలా నిర్వర్తించగలుగుతుంది? సంఘ సభ్యుల సమావేశాల నిర్వహణకోసం ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక భవనాల నిర్మాణంపై దృష్టిసారించాలి.

**కార్యాచరణ ప్రణాళిక అమలు** : ప్రస్తుతం కాలువ ఎగువ భాగంలోని రైతులు కేటాయించిన దానికన్నా అధికంగా నీటిని వినియోగించుకోవడం రివాజుగా మారింది. దీనివల్ల ఆయకట్టు దిగువ రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాగునీటి పంపిణీలో ఈ అసమానతలకు వెంటనే తెరపడాలి. ఇందుకోసం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను ఇంజినీర్లు రూపొందించాలి. దాన్ని సాగునీటి సంఘాలు అమలుపరచాలి. చట్టం అమలులోకి వచ్చి పదిహను సంవత్సరాలైనా ఎక్కడా నిర్దేశిత విధానం అమలుకు నోచుకోవడమే లేదు. కార్యాచరణ ప్రణాళిక రూపరచనలో ఇంజినీర్లకు సరైన శిక్షణ కొరవడటమే ఇందుకు కారణం. ఇక సాగునీటి పంపిణీలో అసమానతలను తొలగించటం ఎలా సాధ్యం? అందుకే సాగునీటి సంఘాలు ఏర్పడినా కాలువ శివారు భూములకు నీరు అందని దుస్థితి దాపురిస్తోంది. 'వాలంతరీ', ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజి ఆఫ్ ఇండియా (హైదరాబాద్) శిక్షణ సంస్థల్లో ఇంజినీర్లకు ఇస్తున్న శిక్షణ అసమగ్రంగా ఉంటోంది. ఈ విధానంలో మార్పు రావాలి. శిక్షణ సంస్థల పర్యవేక్షణలో ఇంజినీర్లు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించే విధానం రావాలి. వాటిని సమర్ధంగా అమలుపరచగల మెలకువలను సాగునీటి సంఘాల ప్రతినిధులకు, క్షేత్ర సిబ్బందికి సంస్థలు నేర్పించాలి. ఈ కార్యక్రమం నిరంతర ప్రాతిపదికన జరగాలి. సాగునీటి వ్యవస్థ నిర్వహణలో అనుభవమున్న ఇంజినీర్లకు, వ్యవసాయ శాస్త్రవేత్తలకు శిక్షకులుగా నియమించాలి. అప్పుడే సాగునీటి పంపిణీ సమర్ధంగా జరిగి, సంఘాల ఉనికికి సార్ధకత లభిస్తుంది.

**మరమ్మతు పనుల ప్రాధాన్య క్రమం :** ప్రతి ఖరీఫ్, రబీ పంటల కాలానికి ముందు సాగునీటి సంఘం నిర్వహణ మండలి, సాధికార ఇంజినీరు కాలినడకన కాల్వలను, కట్టడాలను తనిఖీ చేయాలని చట్టం నిర్దేశిస్తోంది. తనిఖీ అనంతరం మరమ్మతు పనుల జాబితా తయారు చేయాలి. నిధుల లభ్యతను బట్టి ప్రాధాన్య క్రమంలో మరమ్మతు పనులు చేపట్టాలి. చట్ట నిబంధనలు స్పష్టంగా ఉన్నా, అనేక సందర్భాల్లో వీటిని దారుణంగా ఉల్లంఘిస్తున్నారు. సాగునీటి సంఘాల ప్రమేయం లేకుండా ఇంజినీరింగ్ అధికారులు ఏకపక్షంగా పనులు నిర్వహిస్తున్నారు. దీనివల్ల సాగునీటి సంఘాల ఉనికే ప్రశ్నార్థకమవుతోంది. అయిదు లక్షల రూపాయల్లోపు పనులను సాగునీటి సంఘాలే స్వయంగా నిర్వహించాలి. ఎక్కువ మొత్తం విలువగల పనులను ఆయకట్టుదారుల వర్గాల ద్వారాగాని, గుత్తేదారులతోగానీ చేయించవచ్చు. ఆ పనుల్లో సైతం నాణ్యత పర్యవేక్షణ బాధ్యత సాగునీటి సంఘాలదే! ప్రస్తుతం నాగార్జునసాగర్, కృష్ణా, గోదావరి, తుంగభద్ర డెల్టాలు, ఇతర ప్రాజెక్టుల ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. ఆయా పనుల నాణ్యత తనిఖీ బాధ్యతలనూ సాగునీటి సంఘాలకు

దఖలుపరచాలి. ఇందుకోసం సాగునీటి సంఘాలకు క్షేత్ర పరిధిలో తగిన శిక్షణ అందజేయాలి.

**వార్షిక ఆర్థిక తనిఖీ :** ఆర్థిక సంవత్సరం ముగిసిన తరవాత మూడు నెలల్లో ప్రతి సాగునీటి సంఘం విధిగా జమాఖర్చులను ఆడిటర్‌తో తనిఖీ చేయించాలి. 2002-03 సంవత్సరంలో నిర్వహించిన ఓ అధ్యయనం ప్రకారం నీటి వినియోగదారు సంస్థల్లో 12 శాతం, పంపిణీ సంస్థల్లో 28 శాతమే ఆర్థిక తనిఖీలు జరిపించాయి. ప్రజాధనం జమాఖర్చులపై తనిఖీ లోపం తీవ్ర క్రమశిక్షణరాహిత్యమే. 2003 నాటి చట్టసవరణల ప్రకారం ఇలాంటి తనిఖీలు జరిపించని రైతుసంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను పదవుల నుంచి తొలగించాలి. నగదు నిల్వల రాతకోతలపై రైతులకు ఉండే అవగాహన తక్కువ కావడంతో సమస్యలు మొదలవుతున్నాయి. క్రమం తప్పకుండా ఆర్థిక తనిఖీల కోసం రైతు సంస్థల సభ్యులకు నగదు చిట్టా నిర్వాహణపై శిక్షణ ఎంతో కీలకం. విలువైన ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ఉండలంటే ప్రభుత్వం దృష్టిసారించాల్సిన ఈ అంశాల్లో దీనికీ ప్రాధాన్యం దక్కాల్సిందే!

**సామాజిక తనిఖీ :** చట్టంలోని 20వ నిబంధన ప్రకారం, ప్రతి ఖరీఫ్/రబీ పంటకాలం ఆఖరులో నీటి వినియోగం, నిధుల వ్యయం, ఉత్పాదకతలో మెరుగుదల తీరుతెన్నులపై సామాజిక తనిఖీ జరిపించాలి. లోటుపాట్లపై సమగ్ర అధ్యయనం జరగాలి. దీనివల్ల తదుపరి సంవత్సరంలో దిద్దుబాటు చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. గడచిన పదిహేను సంవత్సరాల్లో ఇలాంటి సామాజిక తనిఖీలు జరిగిన దాఖలాలు లేవు. సామాజిక తనిఖీలపట్ల ఆయా సంస్థలకు సదవగాహన లేకపోవడమే ఈ పరిస్థితికి కారణం. అనుభవజ్ఞులైన సామాజిక శాస్త్రజ్ఞుల పర్యవేక్షణలో రైతు సంస్థల ప్రతినిధులకు శిక్షణ ఇప్పించడమే దీనికి సరైన పరిష్కారం.

**సర్వ సభ్య సమావేశాల నిర్వహణ :** చట్టంలోని పదో నిబంధన ప్రకారం, ఖరీఫ్ పంట కాలానికి ముందు ఒకసారి, రబీ పంట కాలానికి ముందు మరోసారి(కనీసం ఏడాదిలో రెండుసార్లు) సర్వసభ్య సమావేశాలు నిర్వహించాలి. వివిధ అంశాలపై సమగ్ర సమీక్ష జరపాలి. లోపాలను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలి. కానీ, 34 శాతం రైతు సంస్థలే ఇలాంటి సమావేశాలు ఏర్పాటు చేసినట్లు అధ్యయనం సారాంశం.

**శాశ్వత సాధికార సంస్థ అవసరం :** సాగునీటి సంఘాల చట్టప్రకారం రైతు సంఘాలకు అనేక రకాల బాధ్యతలు దఖలుపడ్డాయి. ఏటా కోట్ల రూపాయల విలువైన ప్రజాపనులు నిర్వహించాల్సిన గురుతర బాధ్యతను వాటికి అప్పగించారు. బాధ్యత నిర్వహణలో ఆయా సంఘాలకు సమయానుకూల సలహాలు, మార్గదర్శకత్వం అవసరం. ఇందుకోసం అనుభవజ్ఞులైన ఇంజినీర్లు, వ్యవసాయవేత్తలు, ఆర్థిక నిపుణులు, రైతు ప్రతినిధులు సభ్యులుగా శాశ్వత ప్రాతిపదికపై ఒక పర్యవేక్షక సంస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఈ సంస్థ ప్రభుత్వానికి, రైతుసంఘాలకు మధ్య సంధానకర్తగా పనిచేస్తుంది. ప్రస్తుత రైతు సంస్థల్లో నెలకొన్న అయోమయానికి, బాధ్యతల నిర్వహణలో చోటుచేసుకుంటున్న లోటుపాట్ల నివారణకు రాష్ట్రస్థాయినుంచి దిగువస్థాయి వరకు ఇలాంటి పర్యవేక్షక సంస్థల ఏర్పాటు దోహదపడుతుంది.

## రైతుశ్రేయానికే పెద్దపీట

రాష్ట్రంలో సాగునీటి సంఘాల చట్టం-1997లో అమలులోకి వచ్చిన తరవాత సాఫల్యాలకన్నా వైఫల్యాలే ఎక్కువగా కనబడతాయి. ప్రభుత్వం, సాగునీటి సంఘాలు రెండూ ఇందుకు బాధ్యత తీసుకోవాలి. చట్టం అమల్లోకి వచ్చిన ఇన్నేళ్ల తరవాత సైతం ప్రాజెక్టు సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకోకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఫలితంగా మూడంచెల సాగునీటి సంఘాలు తమ విధులను నిర్వర్తించడానికి అవకాశం లేకుండా పోయింది. కార్యవర్తన ప్రణాళిక తయారుచేసి అమలుచేయడంలో, నాణ్యతా ప్రమాణాల పరిరక్షణలో సాగునీటి సంఘాలకు అవసరమైన శిక్షణ అందజేయడంలో ప్రభుత్వం విఫలమైంది. ఇకనైనా సాగునీటి సంఘాల పనితీరు మెరుగుదలకు కార్యాలయ భవనాల ఏర్పాటునుంచి శిక్షణ కార్యక్రమాల వరకు అన్ని అంశాలపైనా ప్రభుత్వం నిబద్ధతతో దీటైన చర్యలు చేపట్టాలి. సంఘాలకు ఎన్నికైన రైతు ప్రతినిధులు సైతం పదవులను ఓ హోదాగా భావించరాదు. లోటుపాట్లను అధిగమిస్తూ సేవాధర్మంతో యథాశక్తి విధులు నిర్వహించడానికి సిద్ధపడాలి. అటు ప్రభుత్వం, ఇటు సాగునీటి సంఘాల ప్రతినిధులు కలిసికట్టుగా కృషిచేసినప్పుడే సాగునీరు అద్యంతం సమంగా పంపిణీ అవుతుంది. అన్నదాతల పైరుపచ్చ ఆశలు నెరవేరతాయి. ◆

# పరిశోధనల్లో వెనుకబడిన భారత్

## తొలి 50 స్థానాల్లో దక్కని చోటు

దేశ ప్రగతికి ఎంతో కీలకమైన పరిశోధనల విషయంలో భారతదేశం వెనుకంజలో ఉన్నట్లు మరోసారి వెల్లడైంది. ప్రపంచంలో పరిశోధనా సంస్థల జాబితాలోని మొదటి 50 స్థానాల్లో భారత సంస్థలేవీ నిలవలేదు. తొలి 150 సంస్థల్లో మాత్రం ఆరింటికి చోటు దక్కింది. అమెరికాలోని 'యూనివర్శిటీ ఆఫ్ పెన్సిల్వేని యా' 2012 సంవత్సరానికి గాను 150 సంస్థలతో ఈ వార్షిక జాబితాను విడుదల చేసింది. ఢిల్లీలోని సెంటర్ ఫర్ సివిల్ సొసైటీ (సీసీఎస్) 51వ స్థానంలో నిలవడం కొంత ఊరట కలిగించే పరిణామం. అమెరికాలోని బ్రూకింగ్స్ ఇనిస్టిట్యూట్ తొలిస్థానంలో నిలిచింది. తర్వాత స్థానాల్లో వరుసగా ఛాతమ్ హౌస్ (యూకే), కార్నెగీ ఎండోమెంట్ ఫర్ ఇంటర్నేషనల్




ప్రధమ స్థానంలో వున్న బ్రూకింగ్స్

పీస్(యూకే) ఉన్నాయి. మొదటి పదింటిలో ఐదు స్థానాలు అమెరికాకే దక్కాయి. జాబితా భారత సంస్థల స్థానాలు... సీసీఎస్ (51), ఇనిస్టిట్యూట్ ఫర్ డిఫెన్స్ స్టడీస్, అనాలిసిస్(ఐటీఎస్ఏ) (105), ఇండియన్ కౌన్సిల్ ఫర్ రీసెర్స్ ఆన్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ రిలేషన్స్ (ఐసీఆర్ఐఈఆర్) (109) ద ఎనర్జీ, రిసోర్స్ ఇనిస్టిట్యూట్ (టీఆర్ఐ) (110), అబ్జర్వర్ రీసెర్స్ ఫౌండేషన్ (ఓ.ఆర్ఎఫ్) (115) డెవలప్మెంట్ ఆల్టర్నేటివ్స్ (141)

# అభియోగ పత్రం తెలుగులోనే ఉండాలి

- జస్టిస్ కె.సి. భాను

కేసులకు సంబంధించి ప్రాథమిక దర్యాప్తు, నివేదిక (ఎఫ్ఐఆర్), అభియోగ పత్రం (ఛార్జిషీట్లు) తెలుగు భాషలోనే నమోదు చేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సి. భాను పోలీసు అధికారులకు సూచించారు. కేసు దర్యాప్తు చేసే అధికారి, ప్రభుత్వ ప్లీడరు, న్యాయమూర్తి తెలుగు భాష తెలిసిన వారు ఉంటారు, కాబట్టి ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. కేసులు, తెలుగు భాషలో నమోదు చేయడంతో సమగ్ర సమాచారం అభియోగ పత్రంలో నమోదతుందన్నారు. బాధితులకూ కేసుకు సంబంధించిన పూర్తి అవగాహన కలుగుతుందని, ఏమైనా పొరపాట్లు ఉన్నట్లయితే వారు గుర్తించేందుకు వీలుంటుందని చెప్పారు. ఏపీ పోలీసు అకాడమీలో ఫిబ్రవరి3వ తేదీన 'పరిశోధనలో సవాళ్లు, పోకడలు' అనే అంశంపై ఆచార్య వేణుగోపాలరావు 17వ స్మారకోపన్యాసం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ కేసీ భాను మాట్లాడుతూ నేరం జరిగిన స్థలానికెళ్లి




దర్యాప్తు చేస్తే కచ్చితమైన ఆధారాలు లభించే అవకాశం ఉంటుందన్నారు. సైబర్ నేరాలను అరికట్టడంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. డీజీపీ దినేష్‌రెడ్డి మాట్లాడుతూ పోలీసుల విచారణ త్వరితగతిన పూర్తి చేస్తే నేరస్థులకు శిక్షలు పడి, బాధితులకు న్యాయం అందుతుందన్నారు.

# వేతనం రూ. 15 వేలు దాటితేనే వృత్తి పన్ను

## చిరుద్యోగులకు ఊరట

రాష్ట్రంలోని చిరుద్యోగులపై ఒక వృత్తి పన్ను భారం ఉండబోదు. నెలవారీ వేతనం రూ.15 వేల లోపు ఉన్నవారిపై రాష్ట్ర సర్కారు ఇక వృత్తి పన్నును విధించదు. వేతనం రూ.15 వేలు – రూ.20 వేల మధ్య గలవారు నెలకు రూ.150, రూ.20వేలు దాటితే నెలకు రూ.200 కట్టాలి. జూనియర్ ఆర్టిస్టులు, సహాయ కెమేరామెన్‌లు ప్రస్తుతం ఏడాదికి రూ.500 చెల్లించాల్సి ఉండగా, ఇప్పుడది రూ.1,250కి పెరిగింది. గుత్తేదార్లకు ఇక తరగతుల వారీగా కాకుండా వార్షిక లావాదేవీల ఆధారంగా పన్నును విధిస్తారు. భవనాన్ని లేదా స్థలాన్ని వాణిజ్య పారిశ్రామిక అవసరాలకు అద్దెకు ఇస్తే ఇక ఏడాదికి రూ.2,500 కట్టాల్సిందే. వృత్తి పన్ను విధింపునకు సంబంధించి ప్రభుత్వం పలు మార్పులు తెచ్చింది. నెలవారీ వేతన జీవుల నుంచి తప్ప మిగతా వృత్తుల వారి నుంచి పన్నుల వసూలు కావటంలేదనే భావనతో ప్రభుత్వం తరచూ ఏదో ఒక సవరణను తెస్తూనే ఉంది. తాజాగా భారీ సవరణలకే నడుంకట్టింది. ఏ వర్గీకరణలోని వారు ఇక ఏ మేరకు వృత్తిపన్నును చెల్లించాలో వివరిస్తూ ప్రభుత్వం సుదీర్ఘ ఉత్తర్వు జారీ చేసింది. ప్రస్తుతం జీతం రూ.5వేల వరకు ఉన్నవారికి మాత్రమే పన్ను మినహాయింపు ఉంది.

- వార్షిక టర్నోవర్ రూ.5–10 లక్షల మధ్య గల వ్యాపారులకు ప్రస్తుతం ఏడాదికి రూ.800 పన్ను ఉండగా ఇక రూ.10 లక్షలు దాటిన వారు మాత్రమే పన్ను పరిధిలోకి వస్తారు. అయితే అటువంటి వారిపై పన్ను ఇప్పటికంటే పెరుగుతుంది. న్యాయవాదులు, నోటరీలు, కన్సల్టెంట్లు వంటివారికి ప్రస్తుతం మూడేళ్ల సర్వీసు వరకు పన్ను లేకపోగా ఇప్పుడా వ్యవస్థ అయిదేళ్లకు పెరిగింది. అయితే ఆ తర్వాత పన్నును ఏడాదికి రూ.2,500 ఉంటుంది. ప్రస్తుతం ఏడేళ్లవరకు రూ.500, ఆ తర్వాత రూ.వెయ్యి మాత్రమే ఉంది. ఇక వృత్తి నిపుణుల వర్గీకరణల సంఖ్యను కుదించి ఒకే వర్గీకరణలోని పలువురిని తీసుకొచ్చింది.
- ఆటో రిక్షాలు తప్ప మిగతా రవాణా మోటారు వాహనాల నిర్వాహకులు ప్రస్తుతం తమ ప్రతి వాహనానికి ఏడాదికి రూ.750 చెల్లిస్తున్నారు. ఇక 3 వాహనాల వరకు పన్ను ఉండదు కాని ఆ తర్వాత ప్రతి వాహనానికి రూ.2,500 చొప్పున కట్టాలి. గ్రామ, మండల స్థాయి సహకార సంఘాలు ఇక పన్నును చెల్లించనక్కరలేదు. జిల్లాస్థాయి సొసైటీకి పన్ను పెరిగింది.
- ఎస్‌టీడీ బూత్ నిర్వాహకులపై ప్రస్తుతం రూ.250 పన్ను పడుతుండగా ఇక ఒకటి కంటే ఎక్కువ లైన్లు గలవారు రూ.2500 చెల్లించాలి.
- వ్యవసాయదారుడు, మతపర విధుల నిర్వాహకులు, కమ్మరి, కుమ్మరి, రజకుడు, నాయిబ్రాహ్మణుడు, దర్జీ, కల్లుగీత కార్మికులు, వికలాంగులు వృత్తి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు.
- ప్రభుత్వం తన షెడ్యూల్‌లో పొందుపర్చని వృత్తులవారి నుంచి ఏడాదికి రూ.750 తీసుకుంటుండగా ఇప్పుడది రూ.2,500కు చేరింది.

**ఇక వృత్తి పన్ను విధింపు ఇలా (రూపాయిల్లో, ఏడాదికి)**

| | |
|---|---|
| న్యాయవాదులు, వైద్యులు, ఇంజినీర్లు తదితర 35 వర్గీకరణలు | ఐదేళ్ల తర్వాత 2,500 |
| గుత్తేదార్లు, వ్యాపారులు, హోటళ్ల టర్నోవర్ రూ. 10 లక్షల లోపు | లేదు |
| టర్నోవర్ రూ.10–50 లక్షల మధ్య | 1,250 |
| టర్నోవర్ రూ.50 లక్షల పైన | 2,500 |
| సినీ నిర్మాతలు, పంపిణీదారులు తదితర 17 వర్గీకరణలు | 2,500 |
| సహాయ డైరక్టర్లు, డాన్సుర్లు తదితర 12 వర్గీకరణలు | 1,250 |
| నర్సింగ్ హోం, పెట్రోల్ బంక్, బ్యూటీపార్లర్ల యజమానులు | 2,500 |
| జిల్లా స్థాయి సహకార సంఘం | 1,250 |
| రాష్ట్ర స్థాయి సహకార సంఘం | 2,500 |
| ఫొటో కాపీయింగ్ యంత్రాలు 3 వరకు | పన్నులేదు |
| యంత్రాలు మూడు దాటితే | 1,250 |
| విద్యాసంస్థల ప్రతి బ్రాంచీ | 2,500 |

# లోక్‌సత్తా సాధించిన విజయాలు

నేతలు, వారి కుటుంబాల చుట్టూ తిరుగుతున్న రాజకీయాన్ని ప్రజల చుట్టూ తిరిగేలా చేసేందుకు, పుట్టుకతో వివక్షలేకుండా ప్రతి బిడ్డా ఎదిగే అవకాశాలను కల్పించి ప్రతి వ్యక్తీ తన జీవితంలో తానే నాయకుడు/నాయకురాలుగా తలెత్తుకుని బతికే వ్యవస్థను నిర్మించేందుకు తగిన సమూల సంస్కరణలతో లోక్‌సత్తా ఒక ఉద్యమంగా 1997లో ప్రారంభమైంది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఇంత విస్తృత ఎజెండాతో ప్రపంచంలో ఎక్కడా పౌరఉద్యమం మొదలవలేదు, లోక్‌సత్తా సాధించినన్ని విజయాల్ని సాధించలేదు. లోక్‌సత్తా... ఇది మీ సత్తా అనే నినాదం తెలుగునాట ప్రతి ఇంటా చిరపరిచితం. ప్రజల సాధికారత కోసం ఆవిర్భవించిన లోక్‌సత్తా ఉద్యమం, తన లక్ష్యసాధనలో భాగంగానే మరింత విస్తృత ప్రభావాన్ని సాధించేందుకు 2006లో రాజకీయ పార్టీగా ఆవిర్భవించింది. లోక్‌సత్తా నూతన ప్రత్యామ్నాయ రాజకీయ సంస్కృతి, జన రాజకీయ విధానాలు ప్రజలలో ఆలోచనపెంచుతున్నందున మిగిలిన పార్టీలపై ఒత్తిడి పెరుగుతోంది. పైపైనే అయినా వారు కూడా మార్పు గురించి మాట్లాడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. లోక్‌సత్తా ఉద్యమం మొదలైనప్పుడు ఆ భాష అర్థం కావటం లేదని, ఇది సాధ్యంకాదని పెదవి విరిచినవారే ఇప్పుడు లోక్‌సత్తా భాషను, వాడాల్సి వస్తోంది. ఈవేళ రాష్ట్రంలోనేకాదు, దేశవ్యాప్తంగా లోక్‌సత్తా విధానాలు, అదే భాషతో కొత్త ఉద్యమాలు, పార్టీలు వస్తున్నాయి. అవినీతి అంతం కావచ్చు, మహిళలపై అత్యాచారాల నిరోధం కావచ్చు లోక్‌సత్తా విధానాలే ప్రామాణికంగా రాజకీయం ముందుకు కదులుతోంది. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు కాబట్టి, మేలు మార్పు కోసం ప్రజలు ఎప్పుడు పూర్తిస్థాయిలో కదులుతారు అనే అంశాన్ని పక్కనపెడితే, లోక్‌సత్తా చెప్పిన మార్గం, విధానాలు తప్ప ప్రజల జీవితాలలో మేలుమార్పు తెచ్చే, భారతదేశాన్ని సుస్థిర అభివృద్ధి పథంలో నడిపించే మరో మార్గం, విధానాలు లేవు. ఇది ఒకటిన్నర దశాబ్దకాలంపైగా చరిత్ర రుజువు చేసిన సత్యం. 1997 నుంచి ఒక ఉద్యమంగా, రాజకీయ పార్టీగా లోక్‌సత్తా సాధించిన కొన్ని ప్రధాన విజయాలు...

## లోక్‌సత్తా @16

**ఓటరు రిజిస్ట్రేషన్**

వ్యవస్థలో మార్పు కోసం ప్రజల చేతిలో ఉన్న ఆయుధం ఓటు. అందుకే ఓటరు జాబితాలలో తప్పులను తొలగించి సరిచేసేందుకు లోక్‌సత్తా చేసిన ప్రయత్నం పట్టణ ప్రాంతాలలో పొరపాట్లు 44శాతం నుంచి 12శాతానికి, గ్రామీణ ప్రాంతాలలో 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గాయి. పోస్టాఫీసులలో శాశ్వత ప్రాతిపదికన ఓటరు రిజిస్ట్రేషన్, సవరణలకు ఏర్పాట్లు చేసేందుకు లోక్‌సత్తా చేసిన సుదీర్ఘ ప్రయత్నం 2009లో పైలెట్ ప్రాజెక్టుగా కార్యరూపం దాల్చింది. ఇది ఇంకా పటిష్టమవ్వాల్సి ఉంది.

**పెట్రోల్ తూనికల అవకతవకలను సరిచేయటం వల్ల ప్రజలకు రూ.2లక్షల కోట్లు ప్రయోజనం**

1998లో పెట్రోల్ తూనికలలో అవకతవకల్ని సరిచేసేందుకు లోక్‌సత్తా అవగాహనతో, చిత్తశుద్ధితో చేసిన ఒక చిన్నప్రయత్నం వల్ల దేశవ్యాప్తంగా 85శాతం తూనికల అవకతవకలు సరయ్యాయి. దీనివల్ల ఈ పదిహేనేళ్లలో ప్రజలకు సుమారు రూ.2లక్షల కోట్ల మేర ప్రయోజనం చేకూరింది.

**నేరచరితపై పోరాటం వల్ల అభ్యర్థుల వివరాలు వెల్లడించే చట్టం**

రాజకీయాలలో నేరచరితులపై లోక్‌సత్తా అనేక ఆందోళనలు చేసింది. 2004 ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్ ఎన్నికలలో నేరచరితుల జాబితాలను విడుదల చేసింది. లోక్‌సత్తా కృషి వల్లే ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులు తమ నేరచరిత్ర, ఆస్తిపాస్తులు వంటి కీలక వివరాలను తప్పనిసరిగా ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించాల్సిన చట్టం వచ్చింది.

**పార్టీల ప్రచార నిధుల సేకరణ చట్టం**

ఎన్నికల ప్రచారంలో నల్లధనం ప్రభావాన్ని గణనీయంగా తగ్గించి నిజాయతీ డబ్బుతో రాజకీయాలు నడిచేలా చేసేందుకు లోక్‌సత్తా చేసిన ప్రయత్నం వల్ల 2003లో రాజకీయ పార్టీల నిధుల సేకరణకు పూర్తి పన్నురాయితీని ఇచ్చే చట్టం వచ్చింది. కేంద్రంలో అప్పటి ఎన్.డి.ఎ ప్రభుత్వాన్ని, ప్రతిపక్ష కాంగ్రెస్‌ని ఒప్పించి ఈ చట్టాన్ని లోక్‌సత్తా సాధించింది.

**సమాచార హక్కు చట్టం (ఆర్.టి.ఐ)**

స్వతంత్ర భారతదేశ చరిత్రలో అతిగొప్ప చట్టంగా చెప్పబడుతున్న పాలనా సమాచార హక్కు చట్టాన్ని సాధించటంలో లోక్‌సత్తాది ప్రధాన పాత్ర. 2005లో వచ్చిన ఆర్.టి.ఐలో ప్రతి అక్షరాన్నీ లోక్‌సత్తా జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ నిశితంగా పరిశీలించి రాశారు. అవినీతి నిరోధానికి ఇది చాలా కీలకచట్టం.

**ప్రజలు సంఘాలుగా ఏర్పడేందుకు ఉదారమైన చట్టం**

**లోక్‌సత్తా @16**

ప్రజలు సంఘాలుగా ఏర్పడి స్వేచ్ఛగా తమ ఆర్థిక, వివిధ సేవా కార్యకలాపాలను నిర్వహించుకునేందుకు రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను సాకారం చేసేలా సహకార సంఘాలను ఏర్పరుచుకునే ఉదారమైన చట్టాన్ని లోక్‌సత్తా అందరినీ ఒప్పించి సాధించింది. ఇందుకోసం 97వ రాజ్యాంగ సవరణను తేవటంలో కీలకపాత్ర పోషించింది.

**మంత్రివర్గ పరిమాణాన్ని కుదించటం**

జంబో సైజులో ఉండే మంత్రివర్గాన్ని కుదించేందుకు లోక్‌సత్తా 91వ రాజ్యాంగ సవరణను సాధించింది.

**పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని పటిష్ఠం చేయటం**

లోక్‌సత్తా కృషి వల్ల రాజ్యాంగం పదవ షెడ్యూల్‌లో ఉన్న పార్టీ ఫిరాయింపుల నిబంధనలు కట్టుదిట్టమయ్యాయి. దీనివల్ల ఈవేళ ఎవరైనా ఎన్నికైన ప్రజాప్రతినిధి పార్టీ మారాలంటే, విధిగా రాజీనామా చేయటం వంటివి అవసరమవుతున్నాయి.

**స్థానిక న్యాయాలయాల (గ్రామ న్యాయాలయాల) చట్టం**

దోపిడీ, గూండాయిజాల బారిన పడకుండా పేదలకు త్వరితంగా తక్కువ ఖర్చుతో న్యాయం అందుబాటులో వచ్చేందుకు స్థానికంగా కోర్టులు అందుబాటులో ఉండేందుకు గ్రామన్యాయాలయాల చట్టాన్ని లోక్‌సత్తా 2009లో సాధించింది. దీంతో, ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే గ్రామీణ ప్రాంతాలలో కేంద్రం సాయంతో తక్షణం 1500కి పైగా స్థానిక న్యాయాలయాలు ఏర్పాటుచేసుకునే అవకాశం లభించింది.

**జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్**

గ్రామీణ భారతదేశంలో పేదలకు, మహిళలకు, పిల్లలకు కనీస ప్రమాణాల వైద్యారోగ్య సేవలను అందుబాటులో తెచ్చేందుకుగాను ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల స్థాయి నుంచి ప్రమాణాలను పెంచేందుకు, తగినంతమంది వైద్యసేవల సిబ్బంది నియామకాలు చేసేందుకు, ప్రాంతాల మధ్య వైద్యసేవల మౌలికవసతుల అంతరాన్ని తగ్గించేందుకు, వికేంద్రీకరణతో వైద్యారోగ్య కేంద్రాలను జిల్లాల పరిధిలోకి తెచ్చేందుకు, ఈ మొత్తం ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచి వైద్యసేవల నాణ్యతను పెంచేందుకు ఉద్దేశించిన విప్లవాత్మక పథకం జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ రూపకల్పనలో లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ్ కీలకపాత్ర పోషించారు.

**సహకార సంఘాలు- రాజ్యాంగ సవరణ**

పౌరులు సంఘాలుగా ఏర్పడి పరస్పర సహకారంతో ఆర్థిక కార్యక్రమాలు వంటివి నిర్వహించుకునే క్రమంలో పాలకులు ఎటువంటి ఆటంకాలు సృష్టించకుండా రాజ్యాంగసవరణను లోక్‌సత్తా రూపొందించింది. దీనికి పార్లమెంటు ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో ఉదార సహకార స్ఫూర్తిని దెబ్బతీస్తూ చట్టం తేవటానికి 2009 ఆగస్టులో అసెంబ్లీలో జరిగిన ప్రయత్నాలని కూకట్‌పల్లి శాసనసభ్యునిగా జయప్రకాష్ నారాయణ్ గట్టిగా అడ్డుకున్న విషయం తెలిసిందే.

**2- జి స్పెక్ట్రం లైసెన్సుల రద్దు**

స్వతంత్ర భారత చరిత్రలో అతిపెద్ద కుంభకోణంగా పేరుమోసిన 2- జి స్పెక్ట్రం అక్రమ లైసెన్సులను రద్దుచేయాలని 2010లో లోక్‌సత్తా చాలా ప్రామాణికమైన కార్యాచరణతో కూడిన ఉద్యమాల్ని నిర్వహించి యువతను చైతన్యపరిచింది. 2-జి లైసెన్సుల రద్దును కోరుతూ ప్రధానమంత్రి

కార్యాలాయాన్ని రూ.1 మనియార్డర్లతో, ఉత్తరాలతో వేలాదిమంది హోరెత్తించారు. జె.ఎం లింగ్డో, ఎన్.గోపాలస్వామి, టి.ఎస్ కృష్ణమూర్తి, పి.శంకర్, జూలియో రెబీరో, అడ్మిరల్ తహిల్యాని తదితర సుప్రసిద్ధ భారతీయులను లోక్‌సత్తా ఒకచోట చేర్చి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసి లాలూచీ అవినీతికి వ్యతిరేకంగా వాదించటంతో, దేశ అత్యున్నత న్యాయస్థానం 2012లో 2 జి స్పెక్ట్రంకు సంబంధించిన 122 లైసెన్సుల్ని రద్దుచేసింది.

**గనుల కేటాయింపును పోటీ వేలం ద్వారా మాత్రమే కేటాయించాలనే చట్టం**

గనులు వంటి పరిమితమైన, విలువైన ప్రకృతి సంపదను అవినీతికి పాల్పడో, ఆశ్రితపక్షపాతంతోనే కేటాయించకుండా అంతర్జాతీయ పోటీ బిడ్డింగ్ ద్వారా కేటాయించాలని లోక్‌సత్తా తొలినుంచీ వాదిస్తోంది. కొత్తగా వచ్చిన గనుల చట్టంలో ఇందుకోసం స్పష్టమైన ఏర్పాటును సాధించింది.

**లోక్‌సత్తా @16**

**ధాన్యం రవాణాపై ఆంక్షల్ని ఎత్తేసి దేశమంతా ఒకే మార్కెట్ చేయాలని రైతుసత్యాగ్రహం- రైతులకు మంచి ధర**

ధాన్యం రేటు పక్కరాష్ట్రాలలో బస్తాకి రూ.1200 పైన ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లో కేవలం రూ.700 ఉన్నా కూడా ధాన్యాన్ని, బియ్యాన్ని పక్క రాష్ట్రాలలోకి రవాణా చేయకూడదు, అమ్మకూడదు అని కేంద్రప్రభుత్వ ఆదేశాన్ని ధిక్కరించి మరీ మన రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన అనైతిక, చట్టవ్యతిరేక ఆంక్షలకు వ్యతిరేకంగా స్వతంత్ర రైతు సంఘాలతో కలిసి లోక్‌సత్తా 2012 ఫిబ్రవరి, మార్చి మాసాలలో రైతు సత్యాగ్రహ యాత్రను నిర్వహించింది. కర్నూలు జిల్లా (ఎమ్మిగనూరు) నుంచి కర్ణాటక (గిల్లాసుగూర్) వరకు, నిజామాబాద్ జిల్లా (బోధన్) నుంచి మహారాష్ట్ర (ఏస్గీ) వరకూ జరిగిన ఈ రైతు యాత్రలో జేపీతోపాటు పలువురు రైతులు భుజాల మీద బియ్యాన్ని మోసుకెళ్లి పక్కరాష్ట్రాలలో అమ్మారు. చేతనైతే అరెస్టు చేయాలని వారు ప్రభుత్వాన్ని సవాలు చేసినా ప్రభుత్వం వెనక్కి తగ్గింది. జేపీ బృందం సత్యాగ్రహ పాదయాత్ర విజయం సాధించటంతో రైతులకు, వ్యాపారులకు ధైర్యం వచ్చి పక్కరాష్ట్రాలలో అమ్ముకోవటం మొదలుపెట్టటంతో మన రాష్ట్రంలో ధాన్యం ధర రూ.700 నుంచి రూ.1200కి పెరిగింది. దానివల్ల ఆంధ్రప్రదేశ్‌లోని రైతులకు కేవలం ఒక్క బి.పి.టి ధాన్యానికి, కేవలం ఒక్క సీజన్‌లో రూ.3,600కోట్ల లబ్ధి చేకూరింది.

**పత్తి, ధాన్యం ఎగుమతులు**

మన రైతులు, కౌలుదారులు పండించే ధాన్యం, పత్తి వంటి పంటలకు ప్రపంచ మార్కెట్‌లో భారీగిరాకీ ఉన్నా కూడా వాటి ఎగుమతులకు అనుమతించటం కోసం చర్యలు తీసుకోకుండా, రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే చిన్నచిన్న సబ్సిడీలు, నష్టపరిహారాలు వంటి కంటితుడుపు చర్యల కోసం పోరాడుతున్న ప్రభుత్వాలు, రాజకీయ పార్టీల తీరును బట్టబయలు చేస్తూ లాభసాటి ధర వచ్చేందుకు ప్రపంచంలో ఎక్కడైనా తమ ఉత్పత్తులను అమ్ముకునే స్వేచ్ఛ రైతులకు ఉండాలని లోక్‌సత్తా రాష్ట్ర, జాతీయ స్థాయిలో గళమెత్తి పోరాడింది. వ్యవసాయాన్ని ప్రభుత్వ సంకెళ్ల నుంచి విముక్తం చేసి స్వేచ్ఛా వాణిజ్యంగా మార్చాలని, పారిశ్రామికవేత్తలకు వస్తున్నట్టే రైతులకు కూడా తమ పంటల ఎగుమతి ద్వారా లాభాలు రావాలని లోక్‌సత్తా చేసిన రాజీలేని పోరాటం వల్ల 2011లో పాక్షికంగా బియ్యం ఎగుమతులపై ఆంక్షల్ని ఎత్తివేశారు. పత్తి ఎగుమతులకు అనుమతించారు. దీనివల్ల ధాన్యం రైతులకు ధర కొంతమేర పెరగగా, మన పత్తిరైతులకు రికార్డుస్థాయిలో క్వింటాలుకి రూ.7,000-8,000 లభించింది.

**జాతీయ జ్యుడీషియల్ కమిషన్**

మన ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించటంలో కీలకపాత్ర పోషిస్తున్న న్యాయవ్యవస్థలో అవినీతిని అరికట్టేందుకుగాను, ప్రభుత్వ జోక్యం లేకుండా సుప్రీంకోర్టు, హైకోర్టులలో జరిగే న్యాయమూర్తుల నియామకాలు, తొలగింపు చేసేందుకు ఉన్నత న్యాయవ్యవస్థలో స్వతంత్ర ప్రతిపత్తిగల జాతీయ జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు కోసం లోక్‌సత్తా చొరవతో రూపొందిన బిల్లుకు పార్లమెంటులోని ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ కూడా ఆమోదించాయి. త్వరలో అది చట్టంగా రానుంది.

**ఇండియన్ జ్యుడీషియల్ సర్వీసు (ఐ.జె.ఎస్)**

న్యాయమూర్తులుగా దిగువస్థాయి నుంచి సమర్థత,

నిజాయతీగలవారు వచ్చేందుకు వీలుగా ఐ.ఎ.ఎస్ తరహాలోనే ఐ.జె.ఎస్ అనే అఖిల భారత జ్యుడీషియల్ సర్వీసును ఏర్పాటు చేయాలన్న లోక్‌సత్తా ప్రతిపాదన కూడా త్వరలో చట్ట రూపందాల్చనుంది.

**ప్రభుత్వ సేవలను పౌరహక్కుగా అందించే చట్టం (సిటిజన్స్ ఛార్టర్లు)**

జనన ధ్రువపత్రం, రిజిస్ట్రేషన్లు, మంచినీటి కనెక్షన్ వంటి ప్రజలకు అవసరమైన రోజువారీ స్థానిక సేవల కోసం ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఒక హక్కుగా నిర్దిష్ట కాలవ్యవధిలో ప్రజలకు అందించేలా, ఒకవేళ చెప్పిన గడువుకంటే ఆలస్యమైతే రోజుకు రూ. 250–300 పరిహారం చెల్లించేలా పౌరసేవల హక్కు చట్టం కోసం లోక్‌సత్తా సుదీర్ఘంగా పోరాడుతోంది. ఈ చట్టంపై తాజాగా లోక్‌సత్తా పార్లమెంటరీ కమిటీ ముందు వాదనల్ని వినిపించి, చట్టం ముసాయిదాను రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి అందించింది. త్వరలో ఈ చట్టం సాకారం కాబోతోంది.

**లోక్‌సత్తా @16**

వాస్తవానికి, 2001లో సిటిజన్ ఛార్టర్లను ఆంధ్రప్రదేశ్‌లోని స్థానిక ప్రభుత్వాలలో కొన్ని రకాల సేవలకు అమలయ్యేలా చేయగలిగింది. అయితే చట్టబద్ధం కాకపోవటం వల్ల అవి అక్కడితో ఆగిపోయాయి. ఇప్పుడు రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా సిటిజన్స్ ఛార్టర్ల చట్టం తెచ్చేందుకు కృషి చేస్తోంది.

**స్థానిక ప్రభుత్వాలకుఃఅధికారాలు, నిధుల కోసం పోరాటం, తుది దశలో రాజ్యాంగ సవరణ**

ప్రజలకు తమ వీధిలో, తమ ప్రాంతంలో కనీస సౌకర్యాలు, మౌలికవసతులు ఇతరత్రా సేవల కోసం ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ముఖ్యమంత్రుల కోసం ఎదురుచూడకుండా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరహాలోనే స్థానిక ప్రభుత్వాలను కూడా అధికారాలు, నిధులు, నిర్ణీత కాలవ్యవధిలో ఎన్నికలు ఉండాలని దేశచరిత్రలో మొదటిసారిగా 2003లో 1కోటీ 8లక్షల సంతకాలను లోక్‌సత్తా ఉద్యమం కేవలం ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే సేకరించింది. రాష్ట్రప్రభుత్వాలు తమ ఇష్టానుసారం కాకుండా స్థానిక ప్రభుత్వాలకు విధిగా అధికారాలు, నిధులు కేటాయించేలా రాజ్యాంగ సవరణ కోసం లోక్‌సత్తా చేస్తున్న కృషి ఒక కొలిక్కివస్తోంది. అలాగే స్థానిక ప్రభుత్వాల సాధికారతతోపాటు ప్రజలకు నేరుగా 10శాతం నిధులను రాష్ట్రబడ్జెట్‌నుంచి కేటాయించాలని, వార్డు ప్రభుత్వాలను ఏర్పాటు చేయాలని కూడా లోక్‌సత్తా పోరాడుతోంది.

**జన్యుమార్పిడి (జి.ఎం) విత్తనాలు– సుప్రీంకోర్టులో జోక్యం**

భారతదేశంలో జన్యుమార్పిడి పంటలపై పరీక్షలను పదేళ్లపాటు నిలిపివేయాలని సుప్రీంకోర్టు నియమించిన ఉన్నతస్థాయి కమిటీ ఇచ్చిన సిఫార్సును ఆమోదించటం దేశ ఆహార, వైద్యారోగ్య ప్రయోజనాలకు తీరని విఘాతం కలిగిస్తుందని, బహుళ జాతి కంపెనీల గుత్తాధిపత్యాన్ని కట్టడిచేస్తానే జి.ఎం పరిజ్ఞానాన్ని మనదేశం వినియోగించుకోవాలని, కాబట్టి కమిటీ సిఫార్సుల్ని ఆమోదించవద్దని లోక్‌సత్తా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసి జన్యుమార్పిడి పరీక్షల రద్దును అడ్డుకుంది.

**లోక్‌పాల్–లోకాయుక్త**

నేరదర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఏసీబీలకు జవాబుదారీతనంతో కూడిన స్వతంత్ర ప్రతిపత్తి కల్పించి వాటిని జాతీయ, రాష్ట్రస్థాయిలో బలమైన అవినీతినిరోధక వ్యవస్థల పరిధిలోకి తేవాలని, అవినీతి కేసుల ఆ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టుల్ని, స్వతంత్ర ప్రాసిక్యూషన్‌ని ఏర్పాటుచేయాలని, అవినీతిపరుల ఆస్తుల్ని జప్తుచేయాలని 1997 నుంచి లోక్‌సత్తా ప్రజలలో అవగాహనను చైతన్యాన్ని పెంపొందిస్తూ అవినీతిపై బహుముఖ పోరాటానికి వారిని సన్నద్ధం చేస్తూ వచ్చింది. ఇటీవల 2 జి, కామన్వెల్త్, ఆదర్శ్, గనుల కుంభకోణాల నేపథ్యంలో ప్రజలలో అవినీతి వ్యతిరేక చైతన్యం పెల్లుబికిన నేపథ్యంలో దాన్నో అవకాశంగా మలుచుకుని జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలలో బలమైన లోక్‌పాల్, లోకాయుక్తల కోసం లోక్‌సత్తా గట్టి పోరాటం చేస్తోంది. లోక్‌పాల్, లోకాయుక్త బిల్లుల్ని దూరదృష్టితో పటిష్ఠంగా రూపొందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందించింది. ఇవి కూడా త్వరలోనే కార్యరూపం దాల్చబోతున్నాయి. ◆

# ప్రమాణాలు లేని ఇంజనీరింగ్ కాలేజీలు

- **స్థల విస్తీర్ణంలోనే పెద్దవి**
- **అర్హులైన అధ్యాపకుల ఊసేలేదు**
- **వేతనాల చెల్లింపు మరీ అన్యాయం**

ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు 'సర్వ లోపాలతో' అన్ని రకాలుగానూ హీనస్థితిలో నడుస్తున్నట్లు తేలింది. కళాశాలలను ఏర్పాటు చేసిన స్థలాల విస్తీర్ణం మాత్రమే భారీగా, మెరుగ్గా ఉన్నట్లు పరిశీలనలో వెల్లడైంది. పూర్వ కళాశాలల్లో కొన్నింటికి మినహా మిగతా వాటికి అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఎ.ఐ.సి.టి.ఇ.) నిబంధనల ప్రకారం స్థలాలు ఉన్నట్లు తేలింది. మిగతా అవస్థాపన సౌకర్యాలైన.. భవన నిర్మాణాలు, ప్రయోగశాలలు, కంప్యూటర్ల ఏర్పాటు, గ్రంథాలయాల్లో అవసరమైన పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచడం వంటి వాటిలో వెనుకబడ్డాయి. రాష్ట్రంలోని 684 ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో అధ్యాపకుల కొరత నూటికి నూరు శాతం ఉన్నట్లు వెల్లడైంది. కేవలం 42 కళాశాలల్లో మాత్రమే స్థల సమస్య ఉన్నట్లు నిర్ధరణ జరిగింది. ప్రత్యేక తనిఖీ బృందాల పనితీరుపై గతవారం ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించినప్పుడు ఈ వివరాలు వెలుగు చూశాయి. తద్వారా పెరిగిన రుసుములు తగ్గుతాయని, బోధన రుసుముల పథకం అమలుకు సంబంధించి ప్రభుత్వంపై పడిన ఆర్థిక భారం తగ్గుతుందని సంబర పడుతోంది.

**ఎ.ఐ.సి.టి.ఇ. నిబంధనల ప్రకారం..**

- పట్టణ ప్రాంతాల్లోనైతే కళాశాల ఏర్పాటుకు 2.5 ఎకరాలు ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో పదెకరాలు ఉండాలి.
- ఒక్కో విద్యార్థికి 11.25 చదరపు మీటర్ల చొప్పున నిర్మాణం జరగాలి.
- ప్రతి నలుగురు విద్యార్థులకు ఒక కంప్యూటర్ ఉండాలి.
- బీటెక్‌లో 1:15 నిష్పత్తిలో అర్హులైన అధ్యాపకులు ఉండాలి. పీజీలో 1:12 నిష్పత్తిలో అధ్యాపకులు ఉండాలి.

వీటిని ఆధారంగా చేసుకోని రాష్ట్ర ప్రత్యేక తనిఖీ బృందాలు ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలను తనిఖీ చేశాయి. పై నిబంధనలతో పాటు విద్యార్థుల ప్రాంగణ నియామకాలు, గ్రంథాలయాల నిర్వహణ తీరు, బోధన, బోధనేతర సిబ్బందికి వేతనాల చెల్లింపు, ఖాతాల నిర్వహణ గురించి



తనిఖీ బృందాలు వివరాలు సేకరించాయి. దీని ప్రకారం రాష్ట్రంలో 684 ఇంజినీరింగ్ కళాశాలల్లో కనిపించిన లోపాలివి.

- స్థలం కొరతగా ఉన్న కళాశాలలు తక్కువగా ఉండడానికి ప్రధాన కారణం.. కళాశాలల యాజమాన్యాల ముందుచూపే. కళాశాలలను నడపలేని పరిస్థితులు వస్తే, ఎకరాలకు ఎకరాలు కొనుగోలు చేసిన స్థలం ఆదుకుంటుందని యాజమాన్యాలు భావిస్తున్నాయి. నిర్మాణాల విషయంలోనూ ఇదే ఆలోచనలో ఉన్నాయి. స్థల విస్తీర్ణం విషయంలో వెనుకబడిన 42 కళాశాలల్లో కొన్ని పూర్వ కళాశాలలు ఉండటం గమనార్హం.
- ఇంజినీరింగ్ కళాశాలల్లో పనిచేసే బోధకులకు ఐదు, ఆరో వేతన సంఘం సిఫార్సులు అనుసరించి వేతనాలు చెల్లించాలి. ఇలా చెల్లిస్తున్న కళాశాలలు తక్కువగానే ఉన్నాయి. కొన్ని కళాశాలల యాజమాన్యాలు ఐదో వేతన సంఘం సిఫార్సులు అనుసరించి వేతనాలు ఇస్తున్నా వాటిల్లో హెచ్.ఆర్.ఎ., డి.ఎ. ఉండడం లేదు. 35% కళాశాలల్లో కన్సాలిడేటెడ్ పద్ధతిలో వేతనాల చెల్లింపులు జరుగుతున్నాయి.

  ఎ.ఐ.సి.టి.ఇ. నిబంధనల ప్రకారం సెక్షన్ల పెంపుదలకు అనుమతులు పొందిన కళాశాలలు.

చేరిన విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రతి 60 మంది

**లోపాలున్న కళాశాలలు**

| పరిశీలన | సంఖ్య |
|---|---|
| స్థలం | 42 |
| నిర్మాణాల్లో వెనుకబడినవి | 327 |
| ప్రయోగశాలల కొరత | 485 |
| కంప్యూటర్ల ఏర్పాటులో వెనుకబాటు | 376 |
| గ్రంథాలయాల్లో పుస్తకాల కొరత | 422 |
| అర్హులైన బోధకులు లేనివి | 684 |

విద్యార్థులకు వంతున అధ్యాపకులు, ప్రయోగశాలలు, వర్క్‌షాపులు, కంప్యూటర్లను అందుబాటులో ఉంచాలి. అయితే కొన్ని కళాశాలల్లో తగిన సంఖ్యలో విద్యార్థులు చేరనందున సెక్షన్ల వారీగా కాకుండా అవసరం ఉన్నంత మేరకు మాత్రమే సౌకర్యాలను కల్పిస్తున్నందున వాటి కొరత ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తోంది. మరికొన్ని కళాశాలల్లో రెండు సెక్షన్లకు కలిపి తరగతులను నిర్వహిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు తగినట్లు సౌకర్యాల కల్పన గురించి కళాశాలల యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు.

- అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఉన్నవారు తప్పనిసరిగా ఎంటెక్‌తోపాటు పీహెచ్‌డీ చేసి ఉండాలి. అయితే.. ఎంటెక్‌తో బోధన చేసే వారిలో అత్యధికులకు పీహెచ్‌డీ లేదు. దీనివల్ల కూడా అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉన్నట్లు కనిపిస్తోంది. ◆

## ప్రస్తుత రిజర్వేషన్ల విధానంలోనే స్థానిక సంస్థల ఎన్నికలు

### సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

ప్రస్తుత రిజర్వేషన్ల విధానంలోనే స్థానిక సంస్థల ఎన్నికలకు అనుమతిస్తూ సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. బీసీలకు 34 శాతం, ఎస్సీలకు 18.3 శాతం, ఎస్టీలకు 8.25 శాతం రిజర్వేషన్లకు కోర్టు అవకాశం ఇచ్చింది. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్న హైకోర్టు తీర్పుపై సుప్రీంలో



ఆంధ్రప్రదేశ్ వేసిన పిటిషన్‌పై కోర్టు ఈ ఉత్తర్వులను జారీ చేసింది.

# పడకేసిన 'సామాజిక' వైద్యం!

కనీసపాటి వైద్య సదుపాయాలకూ నోచుకోక గ్రామీణ ప్రజలు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. కాస్తంత దూరంలో సామాజిక, ప్రాంతీయ ఆస్పత్రులు ఉన్నప్పటికీ అవి ఎందుకూ కొరగాకుండా పోతున్నాయి. ఈ ఆస్పత్రుల్లో ప్రసవాలు తదితరాలు చేయడానికి ఒక మహిళా వైద్యురాలు, శస్త్ర చికిత్సలు చేయడానికి ఒక నిపుణుడు, మత్తుమందు ఇచ్చే నిపుణుడు, చిన్న పిల్లల వైద్యులు, ఒక ఫిజీషియన్ తప్పనిసరిగా ఉండాలి. కానీ, వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. మొత్తం 281 ఆస్పత్రుల్లో 1405 మంది ప్రత్యేక (స్పెషలిటీ) విభాగాలకు చెందిన వైద్యనిపుణులు తప్పనిసరిగా ఉండాల్సి ఉన్నా... 880 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 525 (37%) మంది మాత్రమే ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులకు హాజరవుతున్నారు. వీరిలోనూ సగం మందికి పైగా సొంత ఆస్పత్రులున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులకు హాజరైన ఈ వైద్యుల ధ్యాస అంతా సొంత క్లినిక్కులపైనే. ప్రభుత్వ ఆస్పత్రిలో సరైన వైద్యసేవలు అందవని తమ ప్రైవేటు క్లినిక్కులకు రావాలని ఒత్తిడి చేసి రోగులకు తీసుకువెళుతున్నారు. ఈ విషయం వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు తెలిసినా వైద్యులు ఉంటారనే భరోసా లేకుండా పోయింది. వెళ్లటానికి రోగులూ వెనుకంజ వేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో చిన్నపిల్లలు, గర్భిణులు, శస్త్రచికిత్సలు అవసరమైన వారు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది.

**సామాజిక ఆస్పత్రుల పరిస్థితి...**

| సిబ్బంది | పోస్టులు | విధుల్లో ఉన్నవారు | ఖాళీలు |
|---|---|---|---|
| ◆ సర్జన్లు | 281 | 43 | 238 |
| ◆ ఫిజీషియన్లు | 281 | 91 | 190 |
| ◆ మహిళా వైద్యులు | 281 | 156 | 125 |
| ◆ చిన్న పిల్లల వైద్యులు | 281 | 118 | 163 |
| ◆ రేడియో గ్రాఫర్లు | 281 | 117 | 164 |

### అత్తెసరు జీతాలు

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రత్యేక విభాగాల్లో పనిచేసే వైద్యులకు నెలకు రూ.35 వేల నుంచి రూ.40 వేలు వరకు జీతభత్యాల కింద ఇస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో నెలకు రూ. లక్ష వేతనంతో పాటు ఇతర ప్రోత్సాహకాలు ఉంటున్నాయి. ఈ కారణంగానే చాలామంది ప్రభుత్వ సర్వీసుల్లో పనిచేయడానికి ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న వేతనాలను 80% కి పైగా పెంచాలని ప్రభుత్వ వైద్యుల సంఘం నేతలు చాలాకాలం నుంచి కోరుతున్నారు. వేతనాలు పెంచి ప్రైవేటుగా సొంత క్లినిక్కుల నిర్వహణపై నిషేధం పెట్టవచ్చని చెబుతున్నారు. ఈ తరహా చర్యలు తీసుకుంటే ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల కొరత చాలా వరకు తీరుతుంది. ఆస్పత్రులకు వచ్చే రోగులందరికీ వైద్యసేవలు అందుతాయి. ఇందుకోసం వైద్య బడ్జెట్‌ను రూ.500 కోట్ల నుంచి రూ.700 కోట్లు పెంచితే సరిపోతుందని నిపుణులు అంటున్నారు. దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూర్చే ఇలాంటి చర్యలు తీసుకోకుండా... ప్రభుత్వ ఆస్పత్రుల్లో నమోదవుతున్న మొత్తం కేసుల్లో కేవలం రెండు శాతంలోపు ఉండే జబ్బులకు ఆరోగ్యశ్రీ పథకం రూ.1450 కోట్ల వరకు ఏటా ఖర్చు చేస్తున్నారు. ఈ పథకం కింద ఖర్చు చేస్తున్న మొత్తంలో ఎక్కువగా ప్రైవేటు ఆస్పత్రులు లబ్ధి పొందుతున్నాయి. కొన్నేళ్లుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల కొరత ప్రధాన సమస్యగా మారుతున్నా, సమస్య తీవ్రతను ప్రభుత్వం గుర్తించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. పర్యవేక్షణ వైఫల్యం, సామాజిక ఆస్పత్రుల్లో 178 చోట్ల ల్యాబ్ టెక్నీషియన్ల కొరత ఉంది. 127 చోట్ల వైద్యనిపుణులున్నా చికిత్సలు చేయడానికి అవసరమైన వైద్యపరికరాలు లేవు. ఈ ఆస్పత్రుల్లో పరికరాల కోసం రూ.60 కోట్లు అవసరమని ఏడాది కిందట అధికారులు అంచనా వేసినా, ఇప్పటి వరకు ఆ దిశగా చర్యల్లేవు. వైద్యులన్న చోట పరికరాల్లేవు. పరికరాలున్న చోట వైద్యుల్లేరు. ఆస్పత్రుల నిర్వహణకు సంబంధించి పటిష్ఠమైన పర్యవేక్షణ వ్యవస్థ లేకపోవడం దురదృష్టకరం. ◆



జూబ్లీహాల్‌లో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర స్త్రీ, శిశు, సంక్షేమశాఖా మంత్రి కృష్ణ తీరథ్, చిత్రంలో రాష్ట్ర మంత్రి సునీతాలక్ష్మారెడ్డి, ఉన్నతాధికారులు ఉన్నారు

# ఆందోళన కలిగించే బాలికల నిష్పత్తి

- ఎన్. సరోజాదేవి

"కమీషనరేట్ ఆఫ్ ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్‌ఫేర్" ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న జూబ్లీహాల్లో "డిక్లైనింగ్ చైల్డ్ సెక్స్ రేషియో" (CSR) కి సంబంధించిన సదస్సు జరిగింది. లోక్‌సత్తా పార్టీ ప్రతినిధులుగా సాగి హైమాప్రవీణ్, ఎన్. సరోజాదేవి, ఎస్. గజానని ఈ సదస్సులో పాల్గొన్నారు.

"దక్షిణాది రాష్ట్రాల్లో తమిళనాడు, అండమాన్ మినహా మిగిలిన అన్ని రాష్ట్రాల్లో బాలికల సంఖ్య తగ్గిపోవడం, ఆంధ్రప్రదేశ్‌లో గత పదిసంవత్సరాల్లో బాలికల సంఖ్య 18 శాతానికి పడిపోవడం" వంటి ఆందోళన కలిగించే అంశాలపై కేంద్ర శిశు సంక్షేమ శాఖామంత్రి కృష్ణతీరథ్, రాష్ట్రమంత్రి సునీతాలక్ష్మారెడ్డి వివరిస్తూ సదస్సులో ప్రసంగించిన తరువాత... దక్షిణాది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, ఒడిషా రాష్ట్ర మహిళా – శిశు అభివృద్ధి శాఖ అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు "దేశంలో బాలురకన్నా బాలికల సంఖ్య తగ్గడంపై'' పవర్‌పాయింట్ ప్రజెంటేషన్స్ చేశారు. అనంతరం బృందచర్చ జరిగింది.

"ఇంటర్ – మినిస్టీరియల్ కో ఆర్డినేషన్ కమిటీ" (IMCE), అన్ని రాష్ట్రాల్లో బాలిక సంఖ్య తగ్గడానికి గల కారణాలను తెలుసుకోవడానికి, నివారణలు చేపట్టడానికి ఇటువంటి సదస్సులు, సమావేశాలు ఏర్పాటు చేసి... మహిళలు, పౌర సమాజం, ప్రజాప్రతినిధుల ద్వారా కార్యాచరణ ప్రారంభించడం మంచి ప్రయత్నమే.

**1000 మంది బాలురకి వున్న బాలికల నిష్పతి (0-6 సం॥)**
**1991-2011 భారతదేశం**

| సెన్సెస్ | మొత్తం | రూరల్ | అర్బన్ |
|---|---|---|---|
| 1991 | 945 | 948 | 935 |
| 2001 | 927 | 933 | 906 |
| 2011 | 914 | 919 | 902 |

ఈ సదస్సులో తీసుకునే నిర్ణయాలను తక్షణం అమలు పరిచే విధంగా చర్యలు చేపట్టాలి. బాల, బాలికల జనాభా అంతరాన్ని తగ్గిస్తూ, ఆ నిష్పత్తిని **సమానం** చేసే ప్రయత్నం, సాధ్యమయ్యే దిశగా అడుగులు వేయాలి. మనది పురుషాధిక్య సమాజమే. అయినా, స్త్రీ – పురుషులు సమానత్వం కోసం పాటుపడుతూ... మహిళా సాధికారత దిశగా "విద్య, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో ఎదగడానికి" మహిళలు ఎంతో కృషి చేస్తున్నారు. అయినప్పటికీ కూడా మహిళలు వివక్షతకి గురి అవుతూనే వున్నారు. దానికి తోడు పసి పిల్లలని కూడా చూడకుండా... బాలికలు భారమనుకుని వాళ్లని తొలగించుకోవడానికి కూడా కొంతమంది తల్లి, తండ్రులు వెనుకాడటం లేదు. ఇది చాలా అమానుషం.

ప్రభుత్వం పట్టణాల్లో, నగరాల్లో ఇటువంటి సదస్సులు జరపడమే కాకుండా... ప్రధానంగా అవగాహన పెంపొందించాల్సింది గ్రామీణ మహిళల్లో కాబట్టి, ఆ ప్రాంతాల్లో కూడా చర్చలు, సమావేశాలు జరపడం అవసరం.

బాలికల వృద్ధికి ఉపయోగపడే నిర్ణయాలు తీసుకునేటప్పుడు, ఈ



ఆలోచనలు కూడా వారికి తోడ్పడాలనే ఉద్దేశ్యంతో వ్రాస్తున్నాను.

1. ప్రసార మాధ్యమాలైన టెలివిజన్, రేడియో, వార్తాపత్రికలు, వెబ్‌సైట్‌ల ద్వారా ప్రచార వ్యాప్తి చేయించి... బాలికలను పోగొట్టుకోకుండా, వారి సంఖ్య పెంచే ప్రయత్నం చేయాలి.
2. ముఖ్యంగా కుటుంబాల్లో తల్లి, దండ్రులు తమ తమ పిల్లల్ని ఆడపిల్ల – మొగపిల్లాడు అంటూ భేదభావంతో కాకుండా, ఇద్దర్నీ సమానంగా పెంచాలి.
3. మనదేశంలో బాలికల సంఖ్య పెంచాలనుకోవడమే కాదు, వాళ్లని జాగ్రత్తగా రక్షించుకోవలసిన అవసరం కూడా ఎంతైనా ఉంది. ప్రభుత్వం తప్పక దానిపై దృష్టి పెట్టాలి.
5. ప్రభుత్వం అంగన్‌వాడీలకు మరింత పౌష్టిక విలువలు కలిగిన ఆహారాన్ని సరఫరా చేస్తే... పిల్లలకి బలమైన ఆహారం అంది, సమృద్ధిగా ఎదుగుతారు.
6. విద్యావకాశాలు అందరికీ (గ్రామ స్థాయివరకూ) మరింత ఎక్కువ అందుబాటులో వుండాలి. విద్య వుంటే అవగాహన హెచ్చుగా పెంపొందు తుంది.
7. గర్భంలో వున్న పిల్లలు ఆడా, మగ అని ముందుగా తెలియజెప్పే... స్కానింగులు ఇంక ఆపివేయాలి.
8. స్కూల్స్, కాలేజీల్లో స్టూడెంట్స్‌కి "బాల, బాలికల జనాభా నిష్పత్తి, **బాలికల సంఖ్య తరుగుదల**పై" అవగాహన కాంపీటీషన్స్ పెట్టి, వారిని చైతన్యవంతులు చేస్తూ... వారి ద్వారానే గ్రామాల్లోని మహిళలకి, పౌరులకి తెలియచెప్పే వారిగా తయారుచేయాలి.
9. హోర్డింగులు, గోడలపై **"సేవ్ ద గర్ల్"** (ఆడపిల్లని రక్షించుకుందాం) అనే నినాదాలు వ్రాయించి ప్రజల్లోకి వ్యాపింపచేయాలి. ◆

# భారతంలో కీచకపర్వం

జాతీయ నేర నమోదు విభాగం (నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో) గణాంకాల ప్రకారం 2009–2011 మధ్య దేశంలో మొత్తం 68 వేలకుపైగా అత్యాచారం కేసులు నమోదైతే, ఇందులో నేర నిరూపణ జరిగి శిక్షపడింది కేవలం 16 వేల మందికి మాత్రమే. ఎందుకిలా అంటే పోలీసుల అసమర్థ విచారణ, తగిన సాక్ష్యాలు సేకరించక చేతులెత్తేయడం, వెరసి ప్రాసిక్యూషన్ చేసేదేమీ లేకపోవడం' అంటూ బదులిస్తున్నాయి. మధ్యప్రదేశ్‌లో ఎక్కువగా అత్యాచారం కేసులు నమోదవుతున్నాయి. అక్కడ మూడేళ్లలో 9,539 కేసులు నమోదైతే, 2,986 మందికే శిక్షపడింది. పశ్చిమ బెంగాల్‌లో 7,010 కేసులకు గాను 381 మందికి, అస్సాంలో 5,052 కేసులకుగాను 517 మందికి, ఉత్తరప్రదేశ్‌లో 5,364 కేసులు నమోదైతే 3,816 మంది మాత్రమే శిక్ష పడింది.

వేధింపుల్లోనూ ఇంతే : మహిళలపై జరుగుతున్న వేధింపుల కేసుల్లో కూడా శిక్షలు అంతంతమాత్రమే పడుతున్నాయి. పైన చెప్పిన మూడేళ్లలో దేశంలో మొత్తం 1,22,292 కేసులు నమోదైతే శిక్ష మాత్రం 27,408 మందికి పడింది. ఈ కేసు ల్లోనూ మళ్లీ అగ్రస్థానం మధ్యప్రదేశ్‌దే. ఇక్కడ మొత్తం 19,618 కేసులు నమోదైతే 6,091 మందికి శిక్ష పడింది. మహారాష్ట్రలో 10,651 కేసులకు 595 మందిపై నేర నిరూపణ జరిగింది. ఉత్తరప్రదేశ్ మాత్రం కాస్త భిన్నం. ఇక్కడ 9,030 కేసులు నమోదైనా మిగిలిన రాష్ట్రాలకంటే ఎక్కువగా 7,958 మందికి శిక్ష పడింది. కేరళలో 9,232 కేసులకు గాను నేర నిరూపణ జరిగింది 718 మందిపైనే....

| ఏడాది | కేసులు | శిక్షపడింది |
|---|---|---|
| 2009 | 22,397 | 5,316 |
| 2010 | 22,172 | 5,632 |
| 2011 | 24,206 | 5,724 |
| **మొత్తం** | **68,775** | **16,672** |

# ఆపదలో మహిళలకు అండగా...


*ఆపదలో ఉన్న మహిళలను ఆదుకోవటం కోసం కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా 100 జిల్లాల్లో సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. దీంతోపాటు మూడంకెల టెలిఫోన్ నెంబర్‌ను కూడా కేటాయించనుంది. సమస్యల్లో ఉన్న మహిళలు ఈ నెంబరుకు ఫోన్‌చేస్తే తక్షణసాయం లభిస్తుంది. ఢిల్లీ సామూహిక అత్యాచార ఘటన నేపథ్యంలో కేంద్రప్రభుత్వం ఈ చర్యలను చేపట్టింది. ఈమేరకు కేంద్రమంత్రివర్గ కార్యదర్శి అజిత్‌సేథ్ ఇటీవల వివిధ మంత్రిత్వశాఖల అధికారులతో వరుసగా సమావేశాలు జరిపారు. అనంతరం ఏడు శాఖలను ప్రాధాన్యమైనవిగా గుర్తించి, చర్యల అమలుపై ప్రతినెలా తనకు, ప్రధానమంత్రి కార్యాలయానికి నివేదిక పంపించాలని ఆదేశించారు. త్వరలో అమలుకానున్న ఈ చర్యల వివరాలు..*

- **100 జిల్లాల్లో సహాయ కేంద్రాలు**
- **మూడంకెల టెలిఫోన్ నెంబర్**
- **ఏ పోలీస్‌స్టేషన్‌లోనైనా ఫిర్యాదు చేసే అవకాశం**
- **నష్టపరిహారం చెల్లింపు**

- మహిళలపై జరిగే నేరాల గురించి ఫిర్యాదులను ఇక నుంచీ ఏ పోలీస్‌స్టేషన్‌లోనైనా స్వీకరించి, ఎఫ్ఐఆర్ నమోదు చేయవచ్చు. దర్యాప్తు మాత్రం నేరం జరిగిన ప్రాంతంలోని పోలీస్‌స్టేషనే చేపడుతుంది. దీనివల్ల నేరం జరిగిన ప్రాంతం తమ పరిధిలోకి రాదని చెప్పి పోలీసులు తప్పించుకోవటానికి అవకాశం ఉండదు.
- లైంగికవేధింపులకు గురైన బాధిత స్త్రీలకు పరిహారం.
- బాధితులకు మనోధైర్యం కలిగించటం కోసం గుర్తించిన కొన్ని ఆసుపత్రుల్లో సహాయకేంద్రాల ఏర్పాటు. ఈ పథకాలను 2013-14లో దాదాపు 100 జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించనున్నారు.
- ఆపదలో ఉన్న మహిళలను ఆదుకోవటానికి ముందుకొచ్చేవారికి ఇకపై కేసులో సాక్షిగా చేరటం, విచారణకు హాజరుకావటం వంటి ఇబ్బందులుండవు. వారు స్వేచ్ఛగా సమాచారాన్ని అందించవచ్చు.
- మహిళలకే ప్రత్యేకమైన బస్సుల సంఖ్యను పెంచటం.
- దేశవ్యాప్తంగా బస్సు,ట్యాక్సీ డ్రైవర్లుగా మహిళలు ముందుకు వచ్చేలా ప్రోత్సాహించటం.

## ప్రభుత్వ పథకం

- కొన్ని వాహనాల్లో తయారీ సమయంలోనే కిటికీలకు బిగించే అద్దాలు నలుపురంగులో ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజారవాణా బస్సుల అద్దాలకు ఎంతశాతం నలుపురంగును అనుమతించవచ్చు అన్నదానిపై వివిధ శాఖల అధికారులు నిర్ణయం తీసుకుంటారు.
- అవకతవకలకు పాల్పడే బస్సు యజమానులపై కఠినచర్యలు. బస్సు యజమాని, డ్రైవర్, పర్మిట్, లైసెన్స్ వివరాలను తెలియజేసేలా బస్సు లోపలా, బయటా వివరాలను వెల్లడించే ఏర్పాటు.
- ప్రజా రవాణా బస్సుల్లో జీపీఎస్ పరికరాలను అమర్చటం.
- మహిళల పట్ల వివక్షపూరిత వైఖరిని ప్రదర్శించే పోలీసు అధికారులపై కఠినచర్యలు.
- పోలీసు విధుల్లోకి సాధారణ పౌరులను కూడా ఆహ్వానించి వారి సేవలను తాత్కాలికంగా వినియోగించుకోవటం (కమ్యూనిటీ పోలిసింగ్).
- బహిరంగ ప్రాంతాల్లో వీధిదీపాల ఏర్పాటు.
- విద్యార్థులకు విలువలతో కూడిన విద్యాబోధన. నీతి నైతికతలకు ప్రాధాన్యమివ్వటం.
- సినిమాలు, ఛానెళ్లలో మహిళలను మోసకారులుగా, విలన్లుగా చూపించే సంస్కృతిని తగ్గించేలా ప్రయత్నాలు. ◆




# గర్భిణీ స్త్రీలకు, శిశువులకు ఉచిత వైద్యసేవలు

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రప్రథమంగా ఒక బృహత్తరమైన హక్కుతో కూడిన 'జనని శిశు సురక్ష కార్యక్రమం'ను జూన్1, 2011లో అమలులోకి తీసుకు వచ్చింది. ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం గర్భిణి స్త్రీ, గర్భస్థ శిశువుల ఆరోగ్య సంరక్షణ కోసం వారికి ఎటువంటి ఖర్చులు లేకుండా చేయడమే. వ్యవస్థాపరమైన వైద్యశాలల్లో ప్రసవించే మహిళలకు ఏవిధమైన ఖర్చులు లేకుండా చేస్తూ, ఉచిత వైద్య సదుపాయాన్ని కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యం. మహిళల ప్రసూతి ఖర్చులను ఈ కార్యక్రమం కింద పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుంది. చివరకు వినియోగ ఛార్జిలను కూడా వైద్యశాలల వసూలు చేయవు. అంతేకాకుండా, గర్భిణి స్త్రీ ప్రసూతి సమయంలో తన ఇంటి నుండి వైద్యశాలకు తరలిపోవడానికి, ప్రసూతి అనంతరం తల్లి, బిడ్డలు 48 గంటల సంరక్షణ తర్వాత ఇంటికి తిరిగి రావడానికి అవసరమైన రవాణా ఖర్చులను కూడా పొందే హక్కును వారికి ఈ కార్యక్రమం కింద కల్పించడమైనది.

**ప్రభుత్వ పథకం**
**జనని శిశు సురక్ష**

గర్భిణి స్త్రీలు రక్తహీనత, అధిక రక్తపోటు, అంటురోగాలు, సురక్షితంకాని ప్రసవం వంటి సమస్యలను ఎదుర్కొంటారు. దానికి కారణంగా, గర్భిణి స్త్రీ, గర్భస్థ శిశువుల మరణాలను చాలా వరకు తగ్గించుకున్నప్పటికీ, ఆరోగ్య సూచికలు గర్భిణి స్త్రీలకు అవసరమైన ఆరోగ్య సంరక్షణ చర్యలను అందించలేకపోయాయి. 2005లో జనని సురక్ష యోజన ప్రారంభమైన తర్వాత వైద్యశాలల్లో ప్రసూతి సంఖ్య గణనీయంగా పెరిగింది. అయితే, ప్రసూతి అనంతరం, ఎక్కువమంది తల్లులు 48 గంటలకు మించి వైద్యశాలల్లో ఉండటానికి ఇష్టపడక పోవడంతో తల్లి, బిడ్డలకు అందించే వైద్యసేవల్లో లోపం జరుగుతోంది. ప్రసూతి అనంతరం మొదటి 48 గంటలు చాలా ముఖ్యమైనవి. ఆ సమయంలో కొన్ని ఆరోగ్య పరమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.

వైద్యం సమయంలో కొన్ని ఆరోగ్య పరీక్షలు, ఔషధాలు, ఇతర ఖర్చులు అధికంగా ఉన్నందున తల్లి, బిడ్డల ఆరోగ్య సంరక్షణలో కొంత మేర అవరోధాలు కలుగుతున్నాయి. మరి

కొన్ని సందర్భాల్లో రక్తహీనత, సిజేరియన్ వంటి అత్యవసర పరిస్థితులు ఏర్పడినపుడు రక్తం సరఫరా వంటి ఖర్చులు అధికంగా ఉంటున్నాయి. ఇటువంటి పరిస్థితులను నివారించడానికి జనని, శిశు సురక్ష కార్యక్రమాన్ని అమలులోకి తీసుకురావడమైనది. తల్లి, బిడ్డలకు ఒక నెల రోజులపాటు అవసరమైన వైద్య సేవలను ఈ కార్యక్రమం కింద ఉచితంగా అందచేయడమవుతుంది.

### ఈ కార్యక్రమం కింద గర్భిణిలకు లభించే సదుపాయాలు

ఈ కార్యక్రమం కింద గర్భిణిలకు అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా లభ్యమవుతాయి. అంతేకాకుండా, ఆమె ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఐరన్‌టానిక్ వంటి బలవర్థక ఔషధాలను కూడా ప్రభుత్వం సరఫరా చేస్తుంది. దానికి అదనంగా, గర్భిణిలకు రక్తం, మల, మూత్ర పరీక్షలను ఉచితంగా ఈ కార్యక్రమం కింద నిర్వహిస్తారు. అంతేకాకుండా, సాధారణ ప్రసూతి తల్లికి మూడు రోజులు, ఆపరేషన్‌తో ప్రసూతి జరిగిన సందర్భంలో తల్లి ఏడు రోజులపాటు ఉచిత భోజన సదుపాయాన్ని కూడా వైద్యశాలలో ప్రభుత్వమే సమకూరుస్తుంది. వైద్య సేవల నిమిత్తం అవసరమైన సందర్భంలో రక్తాన్ని కూడా ప్రభుత్వపరంగా ఉచితంగానే సరఫరా చేస్తారు.

తల్లి, బిడ్డల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైన మేరకు సాధారణ వైద్యశాల నుండి అన్ని వసతులు కలిగిన వైద్యశాలకు గర్భిణి స్త్రీని తరలించడానికి, అక్కడ వైద్యసేవల అనంతరం తిరిగి ఆమె ఇంటికి చేరడానికి అవసరమైన రవాణా సదుపాయాన్ని కూడా ఈ కార్యక్రమం కింద ప్రభుత్వమే ఉచితంగా కల్పిస్తుంది.

అన్నింటికన్నా ప్రధానంగా, వైద్యశాలల్లో ఇతరత్రా అన్ని తరహా సేవలను ప్రభుత్వం ఉచితంగా అందచేస్తుంది.

జన్మించిన ప్రతి బిడ్డకు 30 రోజుల వరకు ఈ కార్యక్రమం కింద వైద్య సేవలను ఉచితంగా ప్రభుత్వం అందచేస్తుంది. బిడ్డకు అవసరమైన ఔషధాలు, ఇతర వైద్యపరమైన వస్తువులను కూడా ఉచితంగా సమకూరుస్తారు. వాటితోపాటు అనారోగ్యానికి గురైన బిడ్డలకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, అవసరమైన మేరకు రక్తం ఉచితంగా సరఫరా చేయడమవుతుంది. అంతేకాకుండా, తల్లులకు అందించిన సేవలు తరహాలోనే జన్మించిన బిడ్డ అనారోగ్యానికి గురైన సందర్భంలో ఆ బిడ్డను వైద్యశాలకు తరలించడానికి, వైద్యసేవల అనంతరం ఇంటికి చేర్చడానికి అవసరమైన రవాణా సదుపాయాన్ని కూడా ఈ కార్యక్రమం కింది ఉచితంగా కల్పించడమవుతుంది.

ఈ కార్యక్రమాన్ని అమలు చేయడానికి ప్రతి రాష్ట్రం ఒక సమన్వయ అధికారిని నియమించాలని కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడానికి, తల్లి, బిడ్డల సంరక్షణ కోసం అన్ని తరహాల వైద్య సదుపాయాలను కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టవలసి ఉన్నది.

### ఫిర్యాదులు, పరిష్కారాలు


ఈ కార్యక్రమం అమలు జరిగే ప్రతి వైద్యశాలలో అక్కడి ఫిర్యాదులు, పరిష్కారాలను నిర్వహించే స్థానిక, జిల్లా, రాష్ట్రస్థాయి అధికారుల పేరు, చిరునామా, టెలిఫోన్, ఫాక్స్ నెంబర్లను తెలియజేసే బోర్డుల ఏర్పాటు విధిగా జరగాలని ఆదేశాలు జారీ చేయడమైనది. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమం కింద సేవలు అందించే వైద్య శాలల్లో సహాయక కేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు, ఫిర్యాదులు, సూచనలు, సలహాల కోసం ప్రత్యేకంగా పెట్టెలను ఏర్పాటు చేశాయి. ఈ సేవలు అందించే వైద్యశాలల్లోని అధికారులు ప్రతి రెండు రోజులకొక పర్యాయం కనీసం ఒక గంట సమయాన్ని ఫిర్యాదుల స్వీకరణ నిమిత్తం కేటాయించవలసి ఉన్నది. ఈ కార్యక్రమం కింద సేవలు అందించే అన్ని వైద్యశాలల్లోను ఫిర్యాదుల స్వీకరణ, వాటి పరిష్కారానికి తగిన ఏర్పాట్లు చేయవలసి ఉన్నది.

జాతీయస్థాయిలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలోని జనని, శిశు సురక్ష కార్యక్రమం విభాగం ఈ కార్యక్రమం అమలు కోసం కొన్ని మార్గదర్శక సూత్రాలను రూపొందించింది. అయినప్పటికీ, ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉన్నది. ఈ కార్యక్రమం విజయవంతం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వాల అధికార యంత్రాంగం ఆచరణపై ఆధారపడి ఉన్నది. ■

# నిజమైన యోధుడు - యువతకు ఆదర్శప్రాయుడు

ఏ. అన్నపూర్ణ

మన్య – విప్లవం – ఉద్యమం.... అంటే మీకు ఎవరు గుర్తువస్తారు? ఔను ఒకప్పటి తరానికి ఆరాధ్యుడు, పోరాట స్ఫూర్తి ఆవేశం, దేశభక్తి సురాజ్య ఉద్యమ వీరత్వం అతడికే స్వంతం...! అతడే మన "అల్లూరి సీతారామరాజు" ఆగస్టు 1922 వ సం॥ ప్రారంభించిన విప్లవం 1924 వరకూ 2 సం॥ పాటు కొనసాగింది. 24 మే 22వ తేదీ శ్రీరామారాజును బందీగా పట్టుకుంది బ్రిటీష్ ప్రభుత్వం. దేశ విముక్తి కోసం బ్రిటీష్ వారిని ధైర్యంగా ఎదుర్కొన్న అతడి వయస్సు 25 సం॥ ఆధునాతన మారణాయుధాలు లేవు. పోరాటానికి ఎంచుకొన్న ప్రాంతం సురక్షితం కాదు. అతనికి తెలిసిన చోటు కాదు. కొండలు, లోయలూ ఏనాడూ చూసినవి కావు. ఆయన చేసిన పోరాటాలు : 1) 1857 నాటి ప్రథమ సంగ్రామం 2) అల్లూరి సీతారామరాజు మన్య విప్లవం 3) నేతాజీ సుభాష్ బోస్ నడిపిన ఆజాద్ హింద్ సమరం. అల్లూరి సీతారామరాజు చరిత్రను చాలామంది రచయితలు రాయడం జరిగింది. కానీ పూర్తి వివరాలను సేకరించినది శ్రీ ఎం.వి.ఆర్. శాస్త్రి. రాజు గురించిన చరిత్రతోబాటు అనుచరులు స్నేహితులు వివరాలను కూడా అన్వేషించి మరీ రాశారు. సీతారామరాజు టైంలో వచ్చే వార్తా పత్రికల్లో హిందూ మెయిల్ – అమృత బజార్ పత్రిక వంటి ఇతర భాషా వార్తా పత్రికల్లో వచ్చిన రామరాజు సాయుధ తిరుగుబాటు వార్తలను ప్రముఖ పత్రికలలో వచ్చినవి సేవకరించినవి, యధాతధంగా రాసి మనకు తెలియని చరిత్రను అందించారు. మాట మాత్రంచేత అల్లూరి సీతారామరాజు పేరును తలుచుకుంటేనే మనందరికీ ఆవేశం పొంగిపొర్లుతుంది. ఆ మహనీయుల త్యాగాలు యువతకు స్ఫూర్తినిస్తాయనడంలో సందేహం లేదు. అసలు నేటి యువతరం చదవాల్సిన ఎన్నో మంచి పుస్తకాలు ఉన్నాయి.




అందులో విప్లకవీరులు పోరాటయోధులు దేశం కోసం అహర్నిశలూ సాహసం చేసిన వారు ఎందరో మన ముందుకు వచ్చి మనలను ప్రోత్సహిస్తారు.

స్వాతంత్రం కోసం పోరాడిన మన్యం వీరుడిగా గిరిజనుల హృదయాలలో శాశ్వితంగా నిల్చిపోయిన ఈ త్యాగమూర్తికి తెలుగుజాతి గర్వించదగిన మన్యం వీరుడికి మనం అర్పించబోయే నివాళి వారిని అనుసరించి పోరాట పటిమను అలవర్చుకోవడమే కాగలదు. ఈ పుస్తకాన్ని అందరూ తప్పకుండా చదవండి. సర్దార్ భగత్‌సింగ్, చంద్రశేఖర ఆజాద్ వంటి వీరులు కూడా అల్లూరి వంటి గొప్పవారే! ఒక్కొక్కరు ఒక్కో రకంగా జీవితాలను త్యాగం చేసిన ఘనులు. ◆

## పుస్తక పరిచయం

**విప్లవవీరుడు**

**అల్లూరి సీతారామరాజు**

రచయిత :

**ఎం.వి.ఆర్. శాస్త్రి**

ప్రతులకు :
దుర్గా పబ్లికేషన్స్, జి1. సాయికృష్ణ.........
1-1-230/9, వివేకనగర్, చిక్కడపల్లి, హైదరాబాద్-500 020
ఫోన్ : 040-27632824, 9441257961/62
e-mail : durgapublications@gmail.com

వెల : 200/-

## ఇది ఎవరి తప్పు?

కరిగిపోయేది కాలము
తిరిగిరానిది సమయము
అమూల్యమైనది ప్రాణము
వీటి విలువ తెలుసుకుంటున్నారా? నేటియువతరం
వాగ్దానాలు నాయకులవి
బలిదానాలు అమాయకులవి
కడుపుకోత తల్లిదండ్రులకు
మానసిక వేదన కుటుంబసభ్యులకు
అధికారాలు అవకాశవాదులకు
అవమానాలు నిజాయితీపరులకు
అవకాశాలు స్వార్ధపరులకు
అభిషేకాలు ప్రాణంలేని విగ్రహాలకు
ఉద్యమం ముసుగులో విధ్వంసాలు
ప్రభుత్వం ఆస్తుల ధ్వంసాలు
ప్రైవేటు కార్యాలయాలపై దాడులు
చేయిస్తున్నది ఎవరైనా
చేస్తున్నది మనకోసమేనంటారు
జరిగేనష్టం సామాన్యులకి
పెరిగే కష్టం పేదలకి
వాళ్ళ వేళ్ళతో
మన కళ్లు పొడుస్తున్నారు
అంధకారంలో మనం
అందలాలమీద వాళ్ళు

**- కె. సురేష్‌బాబు** కరీంనగర్

# విద్యార్థుల సామర్థ్యాలపై నిరంతర మూల్యాంకనం

ప్రాథమిక విద్యను అభ్యసించే చిన్నారుల సామర్థ్యాలను నిరంతరం సమగ్ర మూల్యాంకనం ద్వారా అంచనావేస్తూ బోధన పటిష్ఠంగా జరిగేలా విధివిధానాలు ఖరారయ్యాయి. ఈ అంశంపై త్వరలో ప్రాథమిక విద్యాశాఖ నుంచి అధికారిక ఉత్తర్వులు రాబోతున్నాయి. 2005 జాతీయ విద్యా చట్రం, 2009 విద్యా హక్కు చట్టాన్ని అనుసరించి రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ పాఠ్యపుస్తకాలను రూపొందిస్తోంది. మూల్యాంకనాన్ని ఎలా అమలుచేయాలన్న దానిపై పంపిన ప్రతిపాదనలకు ప్రాథమిక విద్యాశాఖ ఆమోదం తెలిపింది.

**తరగతుల వారీగా ప్రమాణాలు**

ప్రతి సబ్జెక్టుకూ నిర్ధారించిన విద్యాప్రమాణాలను ఉపాధ్యాయులు తరగతుల వారీగా మూల్యాంకనం చేస్తారు. ఒకటి, రెండు తరగతుల విద్యార్థుల ప్రమాణాలను గుర్తించే సమయంలో ప్రథమ భాష కింద.... వినడం, మాట్లాడడం, ధారాళంగా చదవడం, అవగాహనతో చెప్పడం, రాయడం, సృజనాత్మక వ్యక్తీకరణ వంటి అంశాలను పరిగణనలోనికి తీసుకొంటారు. 6,7,8 తరగతుల విద్యార్థులకు ప్రథమ భాష కింద స్వీయరచన, సృజనాత్మక భాషాంశాలు, సమస్యసాధన, సంధానపరచడం, ప్రాతినిధ్యపరచడం వంటి అంశాలను గమనిస్తారు. ఇలా.. ప్రతి సబ్జెక్టుకు విద్యా ప్రమాణాలను ఖరారు చేశారు. పాఠ్యేతర అంశాలైన... కళావిద్య, సంగీతం–నృత్యం, ఆటలు–వ్యాయామ విద్య, ఆరోగ్య విద్య, పని విద్య, సాంకేతిక, నైతిక విద్య వంటివాటిల్లో విద్యార్థుల అవగాహనను పరిశీలిస్తారు. వారాంతపు, నెలవారీ, త్రైమాసిక, అర్ధసంవత్సర, వార్షిక పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభను ఎలా గుర్తించాలన్న దానిపైనా కొత్తగా కొలమానాలు ఖరారయ్యాయి. పాఠ్యేతర అంశాలకు రాత పరీక్షలతో నిమిత్తం లేకుండా... ఇతర మూల్యాంకనా సాధనాలను వినియోగించి సామర్థ్యాలను గుర్తిస్తారు. ప్రతి విద్యార్థి పేరుతో డైరీ నిర్వహించి వారి ప్రతిభను ఎప్పటికప్పుడు నమోదు చేసి శ్రేణుల ప్రకారం వారి సామర్థ్యాన్ని ప్రకటిస్తారు.

# కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నా



కూకట్‌పల్లి నియోజకవర్గంలో దాదాపు రూ.110 కోట్ల ఖర్చుతో వివిధ అభివృద్ధి పనులను పూర్తిచేయగా మరికొన్ని పనులు జరుగుతున్నాయని శాసనసభ సభ్యుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తెలిపారు. ఆయన 'విశాలాంధ్ర'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఫతేనగర్ డివిజన్‌లో రూ.7 కోట్లతో రోడ్లు డ్రైనేజీ, వరద కాలువలు, ఇతర పనులు పూర్తిచేయగా రూ.25.21 లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులకోసం మంజూరు చేసామన్నారు. మూసాపేట డివిజన్‌లో 5.35 రోడ్లు పనులు పూర్తిచేయగా రూ.4.05 కోట్లతో రోడ్లు డ్రైనేజీ, వరదకాలువ పనులు పూర్తి చేశామన్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో రూ.17 కోట్లతో, కెపిహెచ్‌బి డివిజన్ పరిధిలో రూ.15 కోట్లతో, మోతీనగర్ డివిజన్‌లో రూ.22 కోట్లతో రోడ్లు, డ్రైనేజీ, వరదకాలువలు, ఇతర పనులు పూర్తిచేయడం జరిగిందన్నారు. బేగంపేట డివిజన్‌లో రూ.4 కోట్లతో పనులు చేయగా, రూ.2.7 కోట్లతో 19 శ్మశానవాటికలను అభివృద్ధి చేయడానికి మంజూరు చేశామన్నారు. రూ.3 కోట్లతో నాలా పూడికతీత పనులు చేశామన్నారు. రూ.3 కోట్లతో 20 కమ్యూనిటీహాల్స్ నిర్మిస్తున్నామన్నారు. రూ.5 కోట్లతో ప్రభుత్వ ఖాళీస్థలాలకు ప్రహరీలను నిర్మించి పార్కులను అభివృద్ధి పర్చడం జరిగిందని జయప్రకాష్ నారాయణ వివరించారు. విద్యాభివృద్ధి కోసం రూ. 3.36 కోట్లతో 75 పాఠశాలల గదులు, 74 మురుగుదొడ్లు నిర్మించినట్టు తెలిపారు. లోక్‌సత్తా పార్టీ ప్రమేయంతో కాపిటల్ ఐ.క్యు రాజీవ్‌గాంధీనగర్‌లో పాఠశాలను నిర్మించామని తెలిపారు. జనతానగర్, మూసాపేట పాఠశాలలకు ప్రభుత్వ స్థలాన్ని మంజూరుచేయనున్నామన్నారు. లోక్‌సత్తా ఆధ్వర్యంలో 10వ తరగతి బాలబాలికలకు సాయంత్రం ట్యూషన్స్ చెప్పడం వల్ల ఉత్తీర్ణత శాతం పెరిగిందన్నారు. ఆరోగ్యం – పారిశుద్ధ్యం 14 ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణానికి, రెండు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకోసం స్థలాలను గుర్తించామన్నారు. రాందేవ్ ఆసుపత్రిలో 30 నుంచి 50 పడకలకు పెంచడం జరిగిందన్నారు. శిక్షణ–ఉపాధిలో భాగంగా 200 జాబ్‌మేళాలను నిర్వహించి 4 వేలమందికి ఉపాధి కల్పించినట్టు వెల్లడించారు. విద్యుత్ విషయమై లోఓల్టేజ్‌ను నిర్మూలించడానికి రూ.1.7 కోట్లతో బాలానగర్‌కు కొత్తలైన్ వేయించామన్నారు. రూ.16 కోట్లతో 33 కెవి సబ్‌స్టేషన్లు ఐదింటిని మంజూరు చేశామన్నారు. మంచినీటి పరిష్కారం కోసం 8ఎజిడిల నుంచి 11 ఎంజిడి (7లక్షల కోట్ల లీటర్లు) పెంచడం జరిగిందన్నారు. గ్రీన్ కూకట్‌పల్లిలో భాగంగా 16 పార్కుల్లో రూ.50 లక్షలతో గ్రీనరీని ఏర్పాటు చేశామని, 14 పార్కుల్లో రూ.70 లక్షలతో అభివృద్ధి చేస్తున్నామని, 10 పార్కులకు ప్రణాళికలను తయారుచేసి పంపించామన్నారు. ◆

# సమాజానికి నాయకత్వం ఎంతో అవసరం

- ఘనంగా హార్వెస్ట్ వార్షికోత్సవం
- హాజరైన జేపీ, తుమ్మల, ఎస్పీ రంగనాథ్




**ఖమ్మం**

సమాజానికి సమర్థ నాయకత్వం ఎంతో అవసరమని, ఆ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సి ఉందని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. నగరంలోని హార్వెస్ట్ పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యుడు, తుమ్మల నాగేశ్వరరావు, ఎస్పీ రంగనాథ్, డా॥ నాగమణితో కలిసి వార్షికోత్సవ సభలో జేపీ పాల్గొన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ విద్య విషయంలో అంతర్జాతీయ స్థాయిలో భారత్ 73వ స్థానంలో ఉందన్నారు. బట్టీపట్టి చదివే చదువులు, ప్రకటించే ర్యాంకులు ఎందుకూ కొరగావన్నారు. ఎడాపెడా ఇంజినీరింగ్ కళాశాలలకు అనుమతులిచ్చిన రాష్ట్ర ఉన్నతాధికారులు వాటిలో నైపుణ్యాలను పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. విద్యార్థులలో నైపుణ్యాలను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పదో స్థానానికి చేరుకోవడం అసాధ్యమేమీ కాదన్నారు. తుమ్మల మాట్లాడుతూ బడి బయటకు వెళ్లిన విద్యార్థులను సైతం ఏటా సమీక్షించాల్సి ఉందని సూచించారు. ఖమ్మంలో మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని తుమ్మల అభినందించారు. జేపీ తుమ్మల, ఎస్పీ, రంగనాథ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపల్ పార్వతిరెడ్డి తమ పాఠశాల ప్రగతిని వివరించారు.

# 'ఆధార్'పై అపోహలు తొలగించాలి

**విజయనగరం**

ఆధార్ కార్డులపై జిల్లా ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఈ మేరకు జేసీ పి.ఎ. శోభను కలిసి సమస్యను వివరించారు. చమురు కంపెనీలు, ప్రభుత్వ ఇస్తున్న ప్రకటనలతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారని చెప్పారు. దీనిపై జేసీ సానుకూలంగా స్పందించారు. జేసీని కలిసిన వారిలో యువసత్తా ప్రతినిధులు పి.వి.రమణ, కె.దయానంద్ తదితరులు ఉన్నారు.

## ఆధార్ కోసం పాట్లు

ఆధార్ కార్డుల కోసం విద్యార్థులకు పాట్లు తప్పడం లేదు. ఉపకార వేతనాలు పొందాలంటే తప్పనిసరిగా ఆధార్ నంబర్ పొందుపర్చాలని ఆదేశించడంతో విద్యార్థులు కేంద్రాల చుట్టూప్రదక్షిణలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

# యువత కదిలితే అవినీతి అంతం

**మేధ ఇంజనీరింగ్ కళాశాల ఖమ్మం**

ఇనుప కండరం, ఉక్కు నరాలు కలిగిన యువత... తమ సామర్థ్యం, విద్య, వినయం, సంకల్పబలంతో భుజ భుజం కలిపి కదలాలి... కులమతాలకు అతీతంగా అవినీతి నిర్మూలనకు ముందుకు రావాలి. అప్పుడే అవినీతి దానంతట అదే అంతమవుతుంది. అని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఖమ్మం గ్రామీణ మండలం మేధ మహిళా యంత్ర విద్య (ఇంజనీరింగ్) కళాశాలలో 'అవినీతి నిర్మూలన – యువత పాత్ర' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జయప్రకాష్ నారాయణ్ మాట్లాడారు. ' నా చిన్ని పొట్టకు నేను శ్రీరామ రక్ష' అని కాకుండా సమాజం కోసం యువత పాటుపడాలన్నారు. ప్రపంచ దేశాల కంటే... మన దేశంలో సహజ, మానవ వనరులు అధికంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం కావాల్సిందల్లా సమర్థవంతమైన నాయకత్వం మాత్రమే అన్నారు. ఆ నాయకత్వాన్ని అందించేవారు లేక... దేశం అధోగతి పాలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రగతికి ప్రధాన అడ్డంకి అవినీతి అని... ఇతర దేశాల్లో అవినీతికి పాల్పడిన



వారిని కఠినంగా శిక్షించి, వారి ఆస్తులను జప్తు చేస్తారని గుర్తు చేశారు. మన దేశంలో అవినీతికి కల్పడిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు.

# అవగాహనతో చదివితేనే విజ్ఞానం

**ఖమ్మం పాఠశాల విద్యార్థులతో డా॥ జేపీ**

జయప్రకాష్ నారాయణ స్థానిక రిక్కాబజార్ పాఠశాలలో విద్యార్థులతో జరిగిన చర్చాగోష్టిలో ఆయన పాల్గొన్నారు. పలువురు విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. ఒక దేశం పేదరికం, దారిద్ర్యం ఆ దేశంలో ఉన్న విద్యావంతులపై ఆధారపడి ఉంటుందన్నారు. చదువు, తెలివితేటలు ఉంటే కఠిన దారిద్ర్యాన్ని అనుభవించే పేదవాడైనా సంపన్నుడితో పోటీపడొచ్చని.... ఈ లక్ష్యంతో ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని పిలుపునిచ్చారు.

వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు మధు, రమ్య, సాయి, సునీత, విజయభాస్కర్ రెడ్డి, అనుధీర్, వినోద్ అడిగిన ప్రశ్నలకు జయప్రకాష్ నారాయణ్ సమాధానాలు ఇచ్చారు.

విద్యార్థులు గుడ్డిగా చదవకుండా భావి అవసరాలను దృష్టిలో పెట్టుకుని చదవాలని యువసత్తా నాయకులు గద్దల విజయ్‌కుమార్ పేర్కొన్నారు. పేదరికాన్ని రూపుమాపే శక్తి చదువుకు మాత్రమే ఉందని జాయింట్ కలెక్టర్ ఎంఎం నాయక్ పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, చదివే చదువు ఏ మేరకు ఉపయోగపడుతుందనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జూపల్లి సత్యనారాయణ, రిక్కాబజార్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కొడమంచిలి మంజుల, రవిమారుత్, భద్రునాయక్ పాల్గొన్నారు.

# సభ్యత్వ నమోదు కార్యక్రమం



మహాత్ముడు చూపిన అహింసా మార్గం సర్వదా అనుసరణీయమని లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ నాయకులు మాదాసు భానుప్రసాద్ చెప్పారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని కళామందిర్ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భానుప్రసాద్ మాట్లాడుతూ గాంధీజీ సిద్ధాంతాలు, ఆశయాలను యువతరం అనుసరించాలని కోరారు. అనంతరం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించి పార్టీ సిద్ధాంతాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మురికిపూడి ప్రసాద్, షేక్ సాధిక్, అబ్దుల్ జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

**చిలకలూరిపేట**

# నీటికోసం కాలనీ వాసుల ఆందోళన



అయ్యా, మంచినీరు లేకుండా ఎలా బతకాలి... అందరం కూలీనాలీ చేసుకునే పేదలం... డబ్బులు పెట్టి నీటిని కొనగలమా...? ఎన్నిసార్లు చెప్పినా మున్సిపల్ అధికారులు మా మొర ఆలకించడం లేదు. అంటూ పట్టణంలోని రాచమల్లు నగర్, వెంగళరెడ్డి కాలనీ వాసులు వాపోయారు. వీరు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. లోక్‌సత్తా నాయకులు కూడా వచ్చి వీరి ఆందోళనకు మద్దతు ప్రకటించారు. కాలనీవాసుల బాధలను మున్సిపల్ డీఈ సుబ్రమణ్యానికి ఫోన్ ద్వారా వివరించారు. మంచినీటి పునరుద్ధరణకు డీఈ హామీ ఇవ్వడంతో తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మేనేజర్ ప్రభాకరరావుకు అందజేసి ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఆయా కాలనీలకు చెందిన మహిళలతో పాటు లోక్‌సత్తా పార్టీ నాయకులు మాదాసు భానుప్రసాద్, షేక్ సాదిక్, మురికిపూడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన లోక్‌సత్తా పార్టీ నాయకులు

స్థానిక లోక్‌సత్తా పార్టీ నాయకులు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ మాదాసు భానుప్రసాద్ ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతూ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని, కాలికి గాయాలైన వారు కట్టుకట్టించుకోవటానికి ఇక్కడకు వస్తేవారి వద్ద నుండి కట్టుకట్టడానికి వంద రూపాయలు వసూలు చేస్తున్నారిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ నాయకులు కృష్ణమూర్తి కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మురికిపూడి ప్రసాద్, శివనాగేశ్వరరావు, మూర్తి, సాదిక్, సుబ్బారావు తదితరలు పాల్గొన్నారు.

# పుల్లేటికుర్రులో లోక్‌సత్తా కార్యాలయం ప్రారంభం



పుల్లేటికుర్రు గ్రామంలో పి. గన్నవరం నియోజకవర్గ లోక్‌సత్తా పార్టీ కార్యాలయాన్ని గంటి పల్లయ్యలింగం ఆధ్వర్యంలో లోక్‌సత్తా పార్టీ రాజమండ్రి నాయకుడు వి.వి. రామారావు ప్రారంభించారు. కార్యక్రమానికి తణుకు సురాజ్య ఉద్యమ కమిటీ ఛైర్‌పర్సన్ కస్తూరి, అమలాపురం నియోజకవర్గ నాయకుడు డి. సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రజలు రాజకీయంగా చైతన్యవంతులయితే సమాజం బాగుపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు గంటి వరలక్ష్మి, జి. బాలకృష్ణ, జి. హరికృష్ణ, అంబేద్కర్, గిడ్డి అప్పారావు, కొత్తపల్లి హరి పాల్గొన్నారు.

**రాజమండ్రి**

# లోక్‌సత్తా పార్టీ సభ్యత్వ నమోదు




లోక్‌సత్తా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా తేది 31.1.2013 చివరి రోజున స్థానిక ఎమ్మార్వో ఆఫీసు వద్ద సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా జనవరి 29, 30 తేదీలలో ఆర్‌జియమ్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించడమైనది.

అవినీతికి, లంచగొండితనం, వారసత్వ రాజకీయంలేని అందరికీ సమానంగా ఎదిగే అవకాశాల కోసం "దేశయువత" లోక్‌సత్తా పార్టీలో చేరినారు. ఈ రోజు 31.1.2013 న సభ్యులు 40 మంది చేరారు. ఈ కార్యక్రమం భవిష్యత్‌లో కూడా జరుగుతుంది. ఈ కార్యక్రమానికి నంద్యాల లోక్‌సత్తా పార్టీ నాయకులు ఎస్.ఎ. మజీద్, ఉపాధ్యక్షులు జి. వెంగళరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎమ్.వి. సత్యనారాయణ. సభ్యులు పుల్లారెడ్డి, ఎ. సత్యనారాయణ, మరియు యువసత్తా కార్యకర్తలు ఎస్.పి. దాస్, పి. విజయ్‌కుమార్, పి. ప్రభాకర్, ఇక్బాల్, అమర్, ఇర్ఫాన్ అలీ తదితరులు పాల్గొన్నారు.

**నంద్యాల**

# లోక్‌సత్తా పార్టీ సభ్యత్వ నమోదు



## పద్మారావునగర్

పద్మారావునగర్‌లోని పార్కు వద్ద లోక్‌సత్తా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టింది. ఆ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి హేమాప్రవీణ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలవడం కోసం కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నారని గెలిచాక అంతకు పదిరెట్లు ప్రజలను దోచుకునే సంపాదిస్తారన్న విషయాన్ని ప్రజలు మర్చిపోకూడదన్నారు. డబ్బు తీసుకుని ఓటేసే విధానాన్ని వ్యతిరేకించినప్పుడే మంచి ప్రజాప్రతినిధులొస్తారని పేర్కొన్నారు. ఆ దిశగా ప్రజలు చైతన్యవంతమవ్వాలన్నారు. కార్యక్రమంలో కిరణ్, రాజీవ్, సాయిప్రకాష్, భాస్కర్, ప్రవీణ్ మూర్తి, శర్మ తదితరులు పాల్గొన్నారు.



## బంజారాహిల్స్

లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ నాయకులు సాంబిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం సాంబిరెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా పార్టీ సభ్యుల ద్వారా నేతల్ని ఎన్నుకునే అవకాశం కేవలం లోక్‌సత్తా పార్టీకే సాధ్యమన్నారు. మహాత్మాగాంధీ కన్న కలలు నిజం కావాలంటే గ్రామ స్వరాజ్యం, అవినీతిలేని పరిపాలన లోక్‌సత్తా పార్టీ ద్వారానే సాధ్యమన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ సభ్యత్వ నమోదుకు అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నేతలు కొండారెడ్డి, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈదర గోపిచంద్‌కు తెలుగు విశ్వవిద్యాలయ కీర్తి పురస్కారం

వయోజన విద్య, అక్షరాస్యతారంగాల్లో కృషి చేసిన, నరసరావుపేట పట్టణానికి చెందిన ప్రముఖ గాంధేయవాది, సంఘ సేవకులు ఈదర గోపిచంద్‌ను 2011 సంవత్సర గాడిచర్ల హరిసర్వోత్తమరావు – బి.వి. దాశరథి కీర్తి పురస్కారానికి ఎంపిక చేశారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైద్రాబాద్‌లో ఈ నెల 31న జరిగిన సభలో పురస్కారం క్రింద రూ. 1116/– సత్కారం అందుకున్నారు. గోపిచంద్‌కు అవార్డు రావడం పట్ల గాంధీస్మారక సమితి నేతలు ఆళ్ళ సుబ్బారెడ్డి, కోళ్ళ వెంకటేశ్వరు అభినందనలు తెలియజేశారు.



# లోక్‌సత్తా టైమ్స్ సురాజ్యం ప్రత్యేక సంచిక

**లోక్‌సత్తా టైమ్స్ రిపబ్లిక్ డే సందర్భంగా సురాజ్య ఉద్యమ ప్రత్యేక సంచికను ప్రచురిస్తున్నాం. సురాజ్య ఉద్యమంపై ప్రత్యేక వ్యాసాలు, ఉద్యమ వార్తలు, ఫొటోలతో రూపొందిస్తున్నాం.**

**ఫిబ్రవరి 28వ తేదీలోగా ఈ ప్రత్యేక సంచికకు ప్రకటనలు ఇచ్చి మీ సహాయ సహకారాలు అందించవలసినదిగా కోరుతున్నాం.**

## గమనిక:

**సురాజ్య ప్రత్యేక సంచికను గతంలో ప్రకటించిన విధంగా తీసుకురాలేకపోతున్నాం.**

**మార్చి 1-15, 2013 లోక్‌సత్తా టైమ్స్‌ను ప్రత్యేక సంచికగా వెలువరిస్తున్నాం. ఈ మార్పును అందరూ గమనించవలసిందిగా కోరుతున్నాం.**

## ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | - | ₹ 20,000 |
| బ్యాక్‌పేజీ | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/ డిడి రూపంలో పంపగలరు.

*"లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

# శేరిలింగంపల్లిలో కార్యకర్తల సమావేశం

ఫిబ్రవరి10న శేరిలింగంపల్లి గణేష్ గార్డెన్స్‌లో జరిగిన నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో జేపీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

నియోజకవర్గంలో పార్టీని పటిష్టంగా నిర్మాణం చెయ్యాలని, ప్రజా సమస్యలను వారి భాగస్వామ్యంతో పరిష్కరించడంలో ముందుండాలని, అలాగే అధికారంలో వున్న కాంగ్రెస్, టిడిపి కార్పొరేటర్ల వైఫల్యాలను ప్రజల ముందు ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

దేశం ఒక కొత్త రాజకీయం కోసం ఎదురుచూస్తోందని, ప్రజలలో తెలియని ఒక అసంతృప్తి, ఆవేదన, ఆవేశం ఉన్నాయని అందుకే ఢిల్లీ ఘటన, లోక్‌పాల్ ఇలా ప్రతి అంశంపై ప్రజలు విరుచుకుపడుతున్నారని, దీనిని లోక్‌సత్తా ఒక అవకాశంగా మలుచుకొని ప్రజలకు వాస్తవాలు తెలియజెప్పి నిర్మాణాత్మక పోరాటానికి సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటారి శ్రీనివాసరావు, నియోజకవర్గ అధ్యక్షులు సురేందర్, సీనియర్ నాయకులు




రామరాజు, శ్రీధర్ ఉక్కలం, పార్నంది హనుమంతు, శ్రీనివాస్ వెలగ, బెల్లం రవి, శ్రీనివాస్ గౌర్తి, వరలక్ష్మి, కష్యప్, నాగరాజు, కపిలవాయి, శ్రీనివాస్, సందేశ్, రమేష్, సిద్ధార్థ్, ఉమామహేష్, తదితరులు పాల్గొన్నారు.

రాబోయే 3 వారాంతాలలో ఆరు డివిజన్ల సభ్యులకు ఒక రోజు శిక్షణ, డివిజన్ స్థాయి సమావేశాలు, అడ్‌హాక్ కమిటీల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దాదాపు 200 మందికి పైగా కార్యకర్తలు సమావేశానికి హాజరయ్యారు.





ఖమ్మం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో డా॥ జేపీ




ఖమ్మం హార్వెస్ట్ స్కూల్ 11వ వార్షికోత్సవంలో జేపీ



నరసరావుపేటలో సభ్యత్వ నమోదు కార్యక్రమం






శేరిలింగంపల్లి నియోజకవర్గ లోక్‌సత్తా కార్యకర్తలతో జేపీ






ఖమ్మం మేధ కాలేజీలో డా॥ జేపీ, రవిమారుత్



చిత్తూరులో గణతంత్ర దినోత్సవ సందర్భంగా...

RNI.Reg. No. APTEL/2010/32219

Postal Reg. No. HD/1126/2013-15



ఖమ్మంలో మేధ మహిళా కళాశాల విద్యార్థులతో డా॥ జయప్రకాష్ నారాయణ్





To,

**Book-Post**

PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times

8-2-674B/2/9, Plot No. 93

Happy valley, Road No. 13A

Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad